
డబుల్ ఇంజన్ సర్కార్‌తో మార్పు చూపించాం
2లో..

www.bhadradrinews.com

# భద్రాద్రి న్యూస్

Bhadradri news Telugu Daily
తెలుగు దిన పత్రిక


బోథ్ మండలంలో పెద్దపులి సంచారం
2లో..

పేజీలు : 5 రూ.5.00 | ఎడిటర్ :చెంగపాంగు సైదులు | గౌరవ సంపాదకులు: నివాస్ బట్టు

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక : 152 మంగళవారం 24 జూన్ 2025 Published from: Khammam, Circulated to : Hyderabad, Karimnagar, Warangal, Karimnagar, Nalgonda, Mahabubnagar




## బనకచర్లపై ఎందాకైనా

# కొట్లాడతాం

### కొత్తగా స్పోర్ట్స్ పాలసీకి కేబినేట్ ఆమోదం

- ట్రిపుల్ ఆర్ రోడ్డు నిర్మాణంలో కీలక నిర్ణయం
- చౌటుప్పల్ నుంచి సంగారెడ్డి వరకు 201కి.మీ ఆమోదం
- బనకచర్లపై రాజీపడేది లేదని నిర్ణయం
- కాళేశ్వరం కమిషన్‌కు కేబినేట్ మినిట్స్ నోట్ అందచేత
- రైతుభరోసా విజయవంతంతో నేడు రైతునేస్తం సభ
- కేబినేట్ నిర్ణయాలు వెల్లడించిన మంత్రి పొంగులేటి

ఏపీ తలపెట్టిన బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణాన్ని అడ్డుకునేందుకు ఎంతవరకైనా పోరాడాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. గోదావరిలో తెలంగాణ వాటా జలాల్లో ఒక్క చుక్క కూడా వదులుకునేది లేదని స్పష్టం చేసింది.



2లో



2లో

## జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాలపై ఫోకస్

జిల్లాల పర్యటనకు మీనాక్షి నటరాజన్ నిర్ణయం
గాంధీభవన్ భేటీలో పలు అంశాలపై సమీక్ష

## పేదల ఇళ్లపై, పోడు భూములపై

# బుల్డోజర్ దాడులు

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు



హైదరాబాద్:తెలంగాణలో పేదల ఇళ్లపై, పోడు భూములపై బుల్డోజర్ల దాడులు కొనసాగుతున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా మండిపడ్డారు. హైదరాబాద్‌లోని పేదల ఇండ్లు కూల్చడం తర్వాత, ఇప్పుడు ఆదివాసీల పోడు భూములపైనా దాడులు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. ట్విటర్ వేదికగా స్పందించిన కేటీఆర్, 'పేదలపైనా, అడవులపైనా ఇప్పుడు బుల్డోజర్లు దాడి చేస్తున్నాయి. పోడు భూముల్లో వ్యవసాయం చేసి జీవిస్తున్న ఆదివాసీలపై పోలీసులు దాడి చేయడం అమానుషం' అని పేర్కొన్నారు. ప్రభుత్వానికి పేదల పట్ల మానవత్వం లేదు, ఆడబిడ్డల పట్ల కనికరం లేదు అని వ్యాఖ్యానించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చలేకపోయిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పుడు వాటిని మరిపించేందుకు బలవంతపు చర్యలకు దిగుతోందని కేటీఆర్ ఆరోపించారు. 'హైడ్రా, మూసీ ప్రక్షాళన పేరుతో హైదరాబాద్‌లో పేదల ఇండ్లను కూల్చడం మొదలై.. పరిశ్రమల పేరుతో లగచర్ల, దిలావర్‌పూర్, పెద్ద ధన్వాడ, చారగొండ, సిరసనగండ్లలో రైతుల భూములపైనా దాడులు జరుగుతున్నాయి' అని చెప్పారు. పట్నం, పల్లె తేడా లేకుండా బుల్డోజర్లను పంపి ప్రజలను బెదిరించడం కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యంగా మారిందని కేటీఆర్ ఆగ్రహించారు. 'ఇది కేవలం భూసేకరణ కాదు.. ప్రజల జీవనాధారాలపై కక్షసాధింపు చర్యలు. పేదల మీద కూల్చే, కాల్చే విధానాలే కాంగ్రెస్ పాలనకు గుర్తుగా మారుతున్నాయని విమర్శించారు.

## వేళ్లన్నీ ప్రభాకర్‌రావు వైపే..!

ఎస్ఐబీ మాజీ ఓఎస్డీ ప్రభాకర్‌రావు అమెరికా నుంచి తిరిగి రావడంతో ఫోన్ అక్రమ ట్యాపింగ్ కేసు ఓ కొలిక్కి వస్తుందని అంతా భావించారు. కానీ, ఆయన విచారణలో మరిన్ని విస్తుపోయే విషయాలు బయటపడుతూ కేసు రోజుకో మలుపు తిరుగుతోంది. ప్రభాకర్‌రావు తమను తప్పుదోవ పట్టించినట్లు ఆయన పైఅధికారులు, రివ్యూ కమిటీ సభ్యులు వెల్లడించినట్లు తెలుస్తోంది.

- తమను తప్పుదోవ పట్టించారంటున్న ఆయన పైఅధికారులు
- నాటి హెూంశాఖ ముఖ్య కార్యదర్శి, నిఘా విభాగాధిపతి వాంగ్మూలం నమోదు?
- త్వరలో మాజీ సీఎస్ శాంతికుమారిది కూడా..
- 15 రోజుల్లో 4 వేలకుపైగా ఫోన్లు ట్యాప్ చేసినట్లు సిట్ గుర్తింపు
- నేడు ఎంపీ ఈటల, ఇతర నాయకుల వాంగ్మూలం
- వరుసగా ఆరోసారి సిట్ విచారణకు ప్రభాకర్ రావు
- స్పష్టమైన సమాధానం ఇవ్వకుండా దాటవేత

2లో






2లో

## ప్రజలను మోసం చేయడంలో కాంగ్రెస్ ముందంజ

గొల్ల కుర్మలను కూడా మోసానికి గురి చేస్తే ఎలా
మాజీమంత్రి హరీష్ రావు విమర్శలు



## కంచగచ్చబౌలి భూములపై విచారణ వాయిదా

**హైదరాబాద్:** కంచ గచ్చిబౌలి భూములపై తెలంగాణ హైకోర్టులో సోమవారం విచారణ జరిగింది. తదుపరి విచారణను సీజే ధర్మాసనం 3 వారాలకు వాయిదా వేసింది. కంచ గచ్చిబౌలి భూములను గతంలో టీజీఐఐసీకి రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. భూమిని అభివృద్ధి చేసి ఐటీ కంపెనీలకు కేటాయించేలా టీజీఐఐసీ ప్రణాళికను సిద్ధం చేసింది. ఈక్రమంలో భూములను జేసీబీలతో చదును చేసింది. దీన్ని అడ్డుకోవాలంటూ హైకోర్టులో వేర్వేరుగా 4 ప్రజాప్రయోజన వ్యాజ్యాలు దాఖలయ్యాయి. వాదనల సందర్భంగా.. టీజీఐఐసీకి భూమిని అప్పగిస్తూ జారీ చేసిన జీవోను రద్దు చేయాలని పిటిషనర్లు కోరారు. సుప్రీంకోర్టులో దీనిపై విచారణ ఉండటంతో.. హైకోర్టు 3 వారాలకు వాయిదా వేసింది.

# భారాస హయాంలో నిధులివ్వకుండానే పనులు

బడ్జెట్ వినియోగంలో పారదర్శకత తీసుకురావడంతోపాటు కేటాయింపులకు తగ్గట్లుగా నిధులను ఖర్చు చేసేలా... అన్ని శాఖల్లో అవసరమైన మార్పులు తీసుకొస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క వెల్లడించారు.

హైదరాబాద్: బడ్జెట్ వినియోగంలో పారదర్శకత తీసుకురావడంతోపాటు కేటాయింపులకు తగ్గట్లుగా నిధులను ఖర్చు చేసేలా... అన్ని శాఖల్లో అవసరమైన మార్పులు తీసుకొస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క వెల్లడించారు. భారాస హయాంలో కేటాయింపులతో సంబంధం లేకుండా భారీగా పనులు మంజూరు చేయడం, వాటిని ఏళ్ల తరబడి సాగదీయడం, కొన్నింటిని కాగితాల్లో తప్ప ప్రారంభించకపోవడం, మరికొన్ని శాఖల్లో కేటాయింపులకు మించి ఖర్చు చేయడం, ఇంకొన్నింట్లో అసలు ఖర్చే చేయకపోవడం వంటి కారణాలతో రాష్ట్రంలో ఆర్థిక అరాచకత్వం ఏర్పడిందన్నారు. దీన్ని సంస్కరించి, గాడిలో పెట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. బడ్జెట్ పరిమితులను పరిగణనలోకి తీసుకొని పనులకు ప్రాధాన్యాన్ని నిర్ణయించడం, చాలావరకు పూర్తయిన పనులను గుర్తించడం, వాటిని ముగించేందుకు తీసుకోవాల్సిన చర్యలను సిఫార్సు చేసేందుకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఛైర్మన్‌గా, నీటిపారుదల, రోడ్లు-



### అప్పటి పెండింగ్ పనుల విలువ రూ.1.75 లక్షల కోట్లు
### వీటన్నింటినీ మంత్రివర్గ ఉపసంఘం పరిశీలిస్తుంది

భవనాలు, పరిశ్రమల శాఖల మంత్రులు సభ్యులుగా ప్రభుత్వం సబ్ కమిటీని నియమించింది.పూర్తయిన వాటికి తాజాగా అనుమతివ్వాల్సిన పరిస్థితి

"గత ప్రభుత్వ హయాంలో... కొన్ని పనులను ఐదారేళ్ల కిందట మంజూరు చేసినా ప్రారంభించలేదు. ఇవి ప్రాధాన్యమైనవో కావో తెలియదు. ఆర్థిక శాఖ అనుమతి లేకుండానే మంజూరు చేసి, పని పూర్తిచేసి బిల్లులు చెల్లించలేని పరిస్థితి సైతం ఉంది. ఉదాహరణకు నిజామాబాద్ జిల్లాలో రూ.79 కోట్లతో ఒక ఎత్తిపోతల పథకాన్ని మంజూరు చేసి, నిర్మాణం పూర్తిచేశారు. బిల్లు మాత్రం చెల్లించలేదు. ఇప్పుడా బిల్లు చెల్లించాలని దస్త్రం రాగా... పరిశీలిస్తే ఆర్థికశాఖ అనుమతే లేనట్లు తేలింది. ఇలాంటి పనులను మొదట కొత్తగా మంజూరు(ర్యాటిఫై) చేసి, తర్వాత బిల్లులు చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది. సాగునీటి రంగంలో, ఆర్అండ్‌బీలో 80-90% వరకు పూర్తయిన పనులు చాలా సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్నాయి. ఇలాంటి వాటిని పూర్తి చేయడానికి ప్రాధాన్యమిచ్చేలా సిఫార్సులు చేయనున్నాం. మధిర నియోజకవర్గంలో వైరా నదిపై వంతెన నిర్మించారు. కానీ, కిందకు దిగే అనుసంధానం(లింక్) పూర్తికాకపోవడంతో వినియోగంలోకి రాలేదు. గిరిజన గురుకుల సంక్షేమ భవనాల్లో కొన్ని 90% వరకు పూర్తయ్యాయి. తక్కువ నిధులతో పూర్తయ్యే ఇలాంటి పనులన్నీ పూర్తి చేస్తాం" అని భట్టి తెలిపారు. ఆ భారం మాపై పడింది.."బడ్జెట్‌లో 1:3 నిష్పత్తిలో నిధులు మంజూరు చేస్తేనే పనులు కొనసాగుతూ...పూర్తవుతుంటాయి. అయితే గత ప్రభుత్వం ఒక విధానమంటూ లేకుండా వ్యవహరించింది. ఆర్థిక శాఖ అనుమతి లేకుండానే వివిధ పనులను మంజూరు చేయడంతోపాటు పూర్తి చేశారు. 2023 డిసెంబరు నాటికి గత ప్రభుత్వం మంజూరు చేసి, బిల్లులు పెండింగ్‌లో పెట్టిన పనుల విలువ రూ.1.75 లక్షల కోట్లు. ఇప్పుడు వీటికి చెల్లింపులు చేయాల్సిన భారం మాపై పడింది. చేసిన ఖర్చులోనూ శాఖల మధ్య సమతౌల్యమే లేదు. కొన్ని శాఖల్లో 105% ఖర్చు చేస్తే, కొన్నింట్లో 40% కూడా చేయలేదు. ఇలా సమతౌల్యం దెబ్బతినకూడదని, బడ్జెట్‌ను మించి ఎక్కువ పనులను మంజూరు చేసి... ఆనక వాటిని చేపట్టలేని పరిస్థితి రాకూడదని, మొత్తంగా పనులు, నిధులు, ఖర్చులపై ఒక విధానపరమైన నిర్ణయం తీసుకోవడానికే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి... ఉపసంఘాన్ని ఏర్పాటు చేశారు" అని భట్టి వెల్లడించారు.

# బనకచర్లపై ఎందాకైనా కొట్లాడుతాం..

హైదరాబాద్: చౌటుప్పల్ నుంచి సంగారెడ్డి వరకు 201కి.మీ మేర ఆర్ఆర్ఆర్ నిర్మాణానికి తెలంగాణ కేబినెట్ ఆమోదం తెలిపింది. కాళేశ్వరం కమిషన్ కోరిన మేరకు కేబినేట్ మినిట్స్ వివరాలు అందించాలని నిర్ణయించారు. అలాగే రైతులకు ఇచ్చిన హామీ మేరకు రైతుభరోసా జమ అయినందున మంగళవార రాష్ట్రవ్యాప్తంగా భరోసా రైతు నేస్తం సభలు నిర్వహించాలని నిర్ణయించారు.

సోమవారం సుదీర్ఘంగా భేటీ అయిన కేబినెట్ కీలక నిర్ణయాలు తీసుకుంది. భేటీలో తీసుకున్న నిర్ణయాలను మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మీడియాకు వెల్లడించారు. నేటితో రైతులందరికీ రైతుభరోసా పూర్తవుతుందని, 9 రోజుల్లో రూ. 9 వేల కోట్ల మొత్తాన్ని రైతులకు అందజేశామని తెలిపారు. రైతుభరోసా కార్యక్రమం పూర్తయిన నేపథ్యంలో మంగళవారం సాయంత్రం 4 గంటలకు సచివాలయంలో రైతుల సమక్షంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించబోతున్నట్లు చెప్పారు. ఈ మేరకు కేబినెట్ నిర్ణయించిందన్నారు. రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాల్లోనూ పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహించనున్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సోమవారం కేబినెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై మంత్రి మండలితో సీఎం రేవంత్‌రెడ్డి చర్చించారు. ప్రధానంగా స్థానిక సంస్థల ఎన్నికలు, బనకచర్లపై చర్చ జరిగింది. కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై పీసీ ఘోష్ కమిషన్ రాష్ట్ర ప్రభుత్వానికి రాసిన లేఖపై కేబినెట్‌లో సుదీర్ఘంగా చర్చించారు. కాళేశ్వరం



ప్రాజెక్ట్‌కి గత కేసీఆర్ ప్రభుత్వంలో మంత్రివర్గ ఆమోదం ఉందా లేదా అనే అంశంతో పాటు పూర్తి వివరాలను ఈ నెల 30వ తేదీలోగా కమిషన్‌కి అందివ్వాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. పీసీ ఘోష్ కమిషన్‌కు మినిట్స్‌తో కూడిన పూర్తి నివేదిక ఇవ్వాలని తెలంగాణ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. అలాగే స్పోర్ట్స్ పాలసీని కేబినెట్ ఆమోదించింది. మంగళవారం తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా రైతు భరోసా విజయోత్సవ సభలు నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన 9 లక్షల ఫిర్యాదులను స్పెషల్ డ్రైవ్ ద్వారా క్లియర్ చేయాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. కాగా, మంత్రివర్గ సమావేశానికి కొత్తగా బాధ్యతలు చేపట్టిన మంత్రులు వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్, వాకిటి శ్రీహరి హాజరయ్యారు. 'వ్యవసాయం దండగ కాదు.. పండుగ అనేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి పొంగులేటి అన్నారు. తెలంగాణ నీటి వాటాను ఏపీకి అప్పగిస్తున్నారని దుష్ప్రచారం చేస్తున్నారు. బనకచర్ల బంకను మా ప్రభుత్వానికి రుద్దాలని ప్రయత్నిస్తున్నారు. ఈ ప్రాజెక్టు విషయంలో చట్టపరంగా, న్యాయపరంగా ముందుకెళ్తాం.

గోదావరి జలాల్లో ఒక్క చుక్క కూడా వదులుకోవద్దని నిర్ణయం తీసుకున్నాం. గోదావరి జలాల విషయంలో జులై మొదటి వారంలో కేంద్రం వద్ద రాష్ట్ర ప్రభుత్వ వాదనలు వినిపిస్తాం. కాళేశ్వరంపై ఈనెల 30లోపు కమిషన్‌కు పూర్తి వివరాలు ఇవ్వాలని నిర్ణయించాం. కాళేశ్వరానికి గత ప్రభుత్వ మంత్రివర్గ ఆమోదం ఉందా? లేదా? వివరాలు ఇవ్వాలని నిర్ణయించాం' అని పొంగులేటి వివరించారు. నూతన క్రీడా పాలసీకి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. క్రీడా

కోటాలో రిజర్వేషన్లు పెంచాలని, క్రీడాకారులను ప్రోత్సహించేలా పారితోషికాలు ఇవ్వాలని నిర్ణయించింది. మీడియా సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి కూడా పాల్గొన్నారు.

## బోథ్ మండలంలో పెద్దపులి సంచారం

ఆదిలాబాద్: ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలో పెద్దపులి సంచారం కలకలం సృష్టించింది. బోథ్ మండల సరిహద్దు ప్రాంతంలో పెద్దపులి తిరుగుతున్నట్లు నిర్ధారణ అయింది. ఈ ఏమరకు అటవీ శాఖ అధికారులు ఏర్పాటు చేసిన ట్రాప్ కెమెరాల్లో పెద్దపులి కనిపించింది. దానికి రెండేండ్ల వయసు ఉంటుందని గుర్తించారు. దీంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. త్వరలో దానిని పట్టుకుంటామని వెల్లడించారు. కాగా, గత గురువారం బోథ్ అతవీ ప్రాంతంలో ఓ దూడపై పెద్దపులి దాడి చేసింది. దీంతో చుట్టుపక్కల తీవ్ర ఆందోళన నెలకొంది

# వేళ్లన్నీ ప్రభాకర్‌రావు వైపే..!

హైదరాబాద్: తెలంగాణను కుదిపేసిన ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తులో కీలక మలుపు తిరిగింది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న రాష్ట్ర స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు సోమవారం ఆరోసారి సిట్ విచారణకు హాజరయ్యారు. ఇప్పటికే ఐదుసార్లు విచారణకు లోనైన ఆయన, ఈసారి కూడా జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్లో విచారణకు హాజరయ్యారు. గత ప్రభుత్వ హయాంలో పలువురు రాజకీయ నాయకులు, జర్నలిస్టుల ఫోన్‌లను ట్యాప్ చేసినట్లు ప్రస్తుత ప్రభుత్వం స్పష్టమైన ఆధారాలతో నిర్ధారించింది. ఈ వ్యవహారంపై అధికారులు ప్రశ్నిస్తే ప్రభాకర్ రావు పూర్తిగా సహకరించట్లేదని సమాచారం. ఆయన నుంచి వచ్చే సమాచారంపై రాజకీయ పార్టీల నేతల ప్రమేయంపై స్పష్టత రావచ్చని అధికారులు భావిస్తున్నారు. ఇప్పటి వరకు జరిగిన ఐదు విచారణల్లో ప్రభాకర్ రావు సూటిగా సమాధానాలు ఇవ్వకుండానే తప్పించుకుంటున్నారని తెలుస్తోంది. మావోయిస్టులతో సంబంధాల పేరుతో వందల మంది

రాజకీయ నాయకులు, పాత్రికేయుల ఫోన్‌లు ఒకేసారి ట్యాప్ చేయడం వెనుక ఉన్న కారణాలను ప్రశ్నించినప్పటికీ, ఆయన క్లారిటీ ఇవ్వలేదని సమాచారం. అందుకే ఈ వ్యవహారాన్ని సిట్ బృందం సుప్రీంకోర్టు దృష్టికి తీసుకెళ్లే అవకాశముంది. ఈ కేసులో ప్రస్తుతం మరికొంతమంది రాజకీయ నాయకుల స్టేట్‌మెంట్లను సిట్ అధికారులు ఇవాళ రికార్డ్ చేయనున్నారు. మొత్తంగా చూస్తే, తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ కేసు ఇంకా అనేక మలుపులతో ముందుకు సాగుతోంది.

## జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాలపై ఫోకస్

హైదరాబాద్: ఏఐసీసీ ఇంచార్జి మీనాక్షి నటరాజన్ మరోసారి జిల్లాల పర్యటనకు సిద్ధమయ్యారు. త్వరలోనే 10 ఉమ్మడి జిల్లాల్లో పర్యటించనున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో సోమవారం నియోజికవర్గ నేతలతో మాట్లాడిన మీనాక్షి నటరాజన్ కీలక ఆదేశాలు జారీ చేశారు. జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని అన్నారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం జై సంవిధాన్ కార్యక్రమంపై ప్రజల్లో అవగాహన పెంచాలని నేతలకు సూచించారు మీనాక్షి నటరాజన్. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత నాయకులపై ఉందని అన్నారు. గాంధీభవన్‌లో జరిగిన సమావేశంలో ఈ మేరకు చర్చించారు. పిసిసి చీఫ్ మహేశ్వర్ గౌడ్ ఆధ్వర్యంలో భేటీ జరిగింది. సీనియర్, జూనియర్ తేడా లేకుండా సమన్వయంతో కలిసి పనిచేయాలని నేతలకు సూచించారు మీనాక్షి నటరాజన్.త్వరలోనే ఉమ్మడి జిల్లాల్లో పర్యటించనున్న మీనాక్షి నటరాజన్.. ఒక్కో గ్రామంలో నియోజకవర్గ నేతలు రాత్రి బస చేసి పరిసరాలను శుభ్రం చేయాలని ఆదేశించారు.నామినేటెడ్ పోస్టులు రాని వారికి చోటు కల్పిస్తామని మీనాక్షి నటరాజన్ హామీ ఇచ్చారు. ఇదిలా ఉండగా.. సామాజిక న్యాయానికి కాంగ్రెస్ కట్టుబడి ఉందని, దాని ఆధారంగానే ఇటు పార్టీలో అటు ప్రభుత్వంలో పదవుల పంపిణీ జరుగుతుందని ఆ పార్టీ రాష్ట్ర

వ్యవహారాల ఇన్?చార్జి మీనాక్షి నటరాజన్ అన్నారు. పార్టీలో సీనియారిటీతో పాటు సిన్సియారిటీని ప్రాతిపదికగా తీసుకొని పదవులు ఇస్తామని స్పష్టం చేశారు. శుక్రవారం పీసీసీ అబ్జర్వర్లు, అన్ని జిల్లాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులతో మీనాక్షి నటరాజన్, పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ జూమ్ మీటింగ్‌లో మాట్లాడారు.

నియోజకవర్గాల వారీగా పీసీసీ అబ్జర్వర్లు ఇచ్చిన నివేదిక ఆధారంగా జిల్లా, మండల అధ్యక్షులను ఏ ప్రాతిపదికన నియమించాలి? ఎవరిని నియమించాలి? అనే అంశంపై సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం పార్టీ నేతలను ఉద్దేశించి మీనాక్షి నటరాజన్ మాట్లాడారు. పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఆలోచనకు అనుగుణంగా సమాజంలో ఎవరి వాటా వారికే అనే సిద్దాంతంతో ముందుకు సాగుతామని చెప్పారు. ఇప్పటి వరకు ఇచ్చిన ప్రతి పదవిలోనూ సామాజిక న్యాయం పాటించామని, ఇకపై కూడా ఇదే పద్ధతిని పాటిస్తామని అన్నారు.

## ప్రజలను మోసం చేయడంలో కాంగ్రెస్ ముందంజ



హైదరాబాద్: తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ హామీలను తుంగలో తొక్కిందని కాంగ్రెస్ పాలనపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీష్ రావు తీవ్రంగా విరుచుకుపడ్డారు. ఎక్స్ వేదికగా చేసిన వ్యాఖ్యలలో ఆయన, కాంగ్రెస్ ప్రభుత్వం పలు ప్రజా ప్రయోజన పథకాలను నిలిపి వేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా బంద్, గ్యాస్ బండకు రాయితీ బంద్, రాజీవ్ యువ వికాసం అమలుకు కాకముందే బంద్, గొర్రెల పంపిణీ మొత్తానికే బంద్.. ఇలా చెప్పుకుంటూ పోతే కాంగ్రెస్ పాలనలో అన్ని పథకాలు బందయినట్టే అని హరీష్ పేర్కొన్నారు. ఆత్మశుద్ధిలేని యాచార మదియేల, భాండశుద్ధి లేని పాకమేల? అనే సామెతను కోట్ చేస్తూ కాంగ్రెస్ నైతికతను ప్రశ్నించారు.

బీఆర్ఎస్ ప్రారంభించిన పథకాలను అటకెక్కించి, మేనిఫెస్టోలో ఊదరగొట్టిన హామీల అమలును గాలికి వదిలేశారు అంటూ ఆయన విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాటలు కోటలు దాటి పరుగులు తీసినా, చేతల పరంగా మాత్రం ప్రజలు ఇంకా నిరీక్షణలోనే ఉన్నారని హరీష్ వ్యాఖ్యానించారు. ప్రజలను మోసం చేయడంలో కాంగ్రెస్ పార్టీకి ప్రత్యామ్నాయం లేదని, పాలన అంటే ప్రతిపక్షాలపై కక్ష సాధించడమేనా? అంటూ ఆయన ప్రశ్నించారు. యాదవ, కురుమ వర్గాలకు ఇచ్చిన హామీల అమలు విషయంలో కాంగ్రెస్ వైఫల్యాన్ని ఆయన ప్రస్తావించారు. వంద రోజులలో గొర్రెల పంపిణీ చేస్తామని చెప్పిన వాడివి, కానీ ఇప్పటి దాకా డిడి డిపాజిట్ చేసిన వారి సొమ్ము కూడా తిరిగి ఇవ్వలేని దుస్థితి మీది. మాటలు విని విసిగిపోయిన యాదవ, కురుమ సోదరులు గాంధీ భవన్ ముందు గొర్రెలతో నిరసన అని వ్యాఖ్యానించారు. మీ మోసాన్ని ప్రజలు గుర్తుంచుకుంటారు.. ఇంకా జాగ్రత్త పడకపోతే ప్రజల తిరుగుబాటు తప్పదు అని హెచ్చరించారు.

## ఉజ్జయిని మహంకాళి బోనాలకు ఆహ్వానం



సిఎంను కలిసి పత్రిక అందించిన మంత్రులు

25 నుంచి 29 వరకు ట్యాంక్‌బండ్‌పై చేతివృత్తుల ప్రదర్శన

హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి శ్రీ ఉజ్జయిని మహంకాళి బోనాల ఉత్సవాల ఆహ్వానం అందింది. ఆషాడంలో ఉజ్జయిని మహాకాళి బోనాలకు ప్రత్యేక స్థానం ఉంది. ఈ నెల 25 నుంచి ఆషాడంతో బోనాల సందడి నెలకొననుంది. అయితే తొలి ఆదివారం గోల్కొండ బోనాలతో సందడి నెలకొంటుంది. తరవాత ఉజ్జయిని మహాకాళి బోనాలు, తరవాత లాల్‌దర్వాజ బోనాలు జరుగనున్నాయి. ఈ క్రమంలో ఉజ్జయిన మహంకాళి బోనాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికను మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు సిఎం రేవంత్ రెడ్డికి అందచేశారు. ఇదిలావుంటే .

బోనాల ఉత్సవాల సందర్భంగా హైదరాబాద్‌లో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 'చేతివృత్తులకు చేయూత' పేరిట రాష్ట్ర స్థాయి ప్రదర్శన జరగనుంది. ఈ నెల 25 నుంచి 29 వరకు ఐదు రోజులపాటు బీసీ చేతివృత్తుల కళాకారులు తయారు చేసిన వివిధ వస్తువుల ప్రదర్శన, అమ్మకం నిర్వహించనున్నామని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం సమీపంలో గల ప్రదేశంలో ప్రతిష్ఠాత్మకంగా ఈ ఎగ్జిబిషన్ ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు. ఈ ప్రదర్శనలో కుమ్మరులు తయారు చేసిన మట్టి పాత్రలు, గౌడన్నల నీరా స్టాల్, మేదరి వారు తయారు చేసిన వెదురు వస్తువులు, పూసల వారి సామగ్రి, పోచంపల్లి, గద్వాల, నారాయణపేట మొదలైన చేనేత ఉత్పత్తులు, ఇతర బీసీ వర్గాలు తయారు చేసిన కళాకృతులు, అనేక రకాల వస్తువులు అందుబాటులో ఉంటాయని చెప్పారు. ఇవే కాకుండా నోరూరించే తెలంగాణ వంటకాలు, బెస్త సోదరులు వండిన సంప్రదాయ చేపల వంటకాలు, సేంద్రీయ ఉత్పత్తులు, ఇతర భోజన స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నామని మంత్రి పొన్నం వివరించారు. ఈ ప్రదర్శన ప్రతి రోజు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9:30 గంటల వరకు కొనసాగుతుందని తెలిపారు. సందర్శకులకు ప్రవేశం ఉచితమన్న ఆయన.. ఈ ప్రదర్శనకు జంట నగరవాసులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని మంత్రి కోరారు. ఈ ప్రదర్శన తిలకించి చేతివృత్తుల కుటుంబాలకు చేయూత అందించి విజయవంతం చేయాలన్నారు.

## అమరావతిలో పలు సంస్థలకు భూ కేటాయింపులు

అమరావతి: మంత్రివర్గ ఉప సంఘం సమావేశంలో రాజధాని అమరావతి భూములకు సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అమరావతి భూముపై 16 అంశాల అజెండాపై చర్చించి.. 12 అంశాలకు ఉప సంఘం ఓకే చెప్పింది. ఎయిర్ ఇండియా, అంబికా దర్బార్ బత్తికి ఇచ్చిన భూములపై సరైన స్పందన లేని కారణంగా వారిని రద్దు చేసినట్లు మంత్రి నారాయణ వెల్లడించారు. సచివాలయంలో మంత్రి నారాయణ నేతృత్వంలో ఈ సమాశేం జరిగింది.. రాజధాని ప్రాంతంలో పలు సంస్థలకు భూకేటాయింపులపై ఈ సమావేశంలో చర్చించారు.. సమావేశానికి మంత్రులు నారాయణ, భరత్, అధికారులు హాజరయ్యారు.. వర్చువల్ గా ఈ సమావేశానికి మంత్రులు పయ్యావుల కేశవ్, కందుల దుర్గేష్ హాజరయ్యారు. 16 అంశాలకు గాను 12 అంశాలు మంత్రివర్గ ఉప సంఘంలో ఆమోదం జరిగిందని మంత్రి పొంగూరి నారాయణ వెల్లడించారు.. 2014- 19 కాలంలో రాజధానిలో భూములు కేటాయించిన సంస్థల్లో నాలుగు సంస్థలకి కొనసాగిస్తూ ఆమోదం తెలిపినట్టు పేర్కొన్నారు.

# డబుల్ ఇంజిన్ సర్కార్‌తో మార్పు చూపించాం



అమరావతి: డబుల్ ఇంజిన్ సర్కారు అధికారంలో ఉంటే ఎలా ఉంటుందో చూపించామని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. స్వర్ణాంధ్రప్రదేశ్ విజన్ 2047ను లక్ష్యంగా పెట్టుకున్నామన్న ఆయన.. అన్నీ చేసేశామని చెప్పట్లేదని, ఊహించిన దానికంటే ఎక్కువే చేశామని తెలిపారు. ఏడాది పాలన సందర్భంగా అమరావతిలో కూటమి ప్రభుత్వం నిర్వహించిన 'సుపరిపాలనలో తొలి అడుగు' సమావేశంలో ఆయన మాట్లాడారు. వైకాపా ప్రభుత్వ విధానాలతో పెట్టుబడిదారుల్లో నమ్మకం పోయింది. మూడు రాజధానుల నమూనాతో రాష్ట్ర అభివృద్ధి కుంటుపడింది. మూడు ముక్కలాటతో రాష్ట్రానికి రాజధాని లేకుండా చేశారు. పోలవరం పూర్తయితే రాష్ట్రానికి నీటి సమస్య సమసిపోతుంది. 2022-23కు నీతిఆయోగ్ నివేదిక ప్రకారం రాష్ట్రం అప్పుల్లో కూరుకుపోయింది. వైకాపా హయాంలో నిధులు మళ్లించి దుర్వినియోగం చేశారు.సీఎం పదవి తనకు కొత్తకాదని.. నాలుగుసార్లు సీఎం అయినట్లు గుర్తు చేశారు. ప్రతిసారీ సమర్థంగా పరిపాలించి సుపరిపాలన అందించానన్నారు. 'మూడు పార్టీలు కలిసి అధికారంలో ఉన్నా ఎలాంటి సమస్య రాలేదు. ఎన్ని ఇబ్బందులు ఉన్నా చెప్పిన మాట నిలబెట్టుకుంటాం. సుపరిపాలన అందించేందుకు అధికారులు కూడా కలిసి రావాలని అన్నారు.

వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మూడు ముక్కలాటతో ఏపీకి రాజధాని లేకుండా చేశారని చంద్రబాబు నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ హయాంలో నిధులు మళ్లించి దుర్వినియోగం చేశారని మండిపడ్డారు. వైసీపీ ప్రభుత్వ విధానాలతో పెట్టుబడిదారుల్లో నమ్మకం పోయిందని చెప్పారు. కూటమి ప్రభుత్వంలో స్వర్ణాంధ్ర విజన్- 2047ను లక్ష్యంగా పెట్టుకున్నామని ఉద్ఘాటించారు. పోలవరం పూర్తయితే ఏపీకి నీటి సమస్య సమసిపోతుందని వెల్లడించారు. వైసీపీ హయాంలో నిధులు మళ్లించి దుర్వినియోగం చేశారని మండిపడ్డారు. అధికారంలోకి రాగానే నాలుగు సంతకాలు పెట్టానని గుర్తుచేశారు. మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చామని ప్రకటించారు. వైసీపీ హయాంలో రెవెన్యూ రికార్డులను అస్తవ్యస్థం చేశారని ఆరోపించారు. 213 అన్న క్యాంటీన్ల ద్వారా రూ.5కే భోజనం పెడుతున్నామని ఉద్ఘాటించారు. విశాఖ ఉక్కు పరిశ్రమకు రూ.11,400 కోట్లు సాయం చేశామని చెప్పారు. అమరావతిని మళ్లీ పట్టాలెక్కించాం.. పూర్తి చేస్తామని మాటిచ్చారు. పోలవరం ప్రాజెక్ట్‌కు రూ.12,500 కోట్లను కేంద్ర ప్రభుత్వం కేటాయించిందని అన్నారు. విశాఖపట్నం రైల్వేజోన్ పనులు వేగంగా జరుగుతున్నాయని వివరించారు. తల్లికి వందనం హామీని పూర్తిగా నిలబెట్టుకున్నామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమకు కేంద్రం రూ.11,400 కోట్లు సాయం చేసింది. అమరావతిని మళ్లీ పట్టాలెక్కించాం.. పూర్తి చేస్తాం. పోలవరం ప్రాజెక్టుకు రూ.12,500 కోట్లు కేటాయించారు. విశాఖ రైల్వే జోన్ పనులు జరుగుతున్నాయి. 'తల్లికి వందనం' హామీని పూర్తిగా నిలబెట్టుకున్నాం. అడ్మిషన్లు పూర్తయ్యాక ఒకటో తరగతి, ఇంటర్ విద్యార్థులకూ ఇస్తాం. 90 శాతం రాయితీతో డ్రిప్ పరికరాలు ఇస్తున్నాం. సౌరశక్తి ఉత్పత్తి, వినియోగంపై విస్తృత ప్రచారం చేస్తున్నాం. ఆదరణ కింద ఎస్సీలు, బీసీలకు అండగా ఉన్నాం. హంద్రీనీవాకు ఒకే ఏడాది రూ.3,800 కోట్లు ఖర్చు చేస్తున్నాం. పర్యాటకానికి పరిశ్రమ హోదా కల్పించాం. రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ పేరుతో నియోజకవర్గానికో కేంద్రం ఏర్పాటు చేస్తాం. ప్రతి కుటుంబం నుంచి ఒక ఆంత్రపెన్యూర్ రావాలి. అనేక కష్టాలున్నా.. 12.2 శాతం వృద్ధి రేటు సాధించాం. విజయవాడ, విశాఖ మెట్రోలకు అనుమతులు వస్తున్నాయి. మద్యం, ఇసుక విధానాలు కొత్తవి తెచ్చాం. ముందుకొచ్చిన పెట్టుబడిదారులను ప్రోత్సహిస్తున్నాం. ఇప్పటివరకు 31 పారిశ్రామిక పాలసీలు తీసుకొచ్చాం అని వివరించారు.

రాయలసీమలో ముఠా తగాదాలు తుదముట్టించాం. వైకాపా హయాంలో గంజాయిని పెంచి పోషించారు. మేం వచ్చాక గంజాయి పంటను పూర్తిగా నిర్మూలించాం. గంజాయి పండించినా, అమ్మినా, వాడినా కఠిన చర్యలు తప్పవు. రాజకీయ ముసుగులో నేరాలు చేయాలంటే నావద్ద కుదరవు. మేం అధికారంలోకి వచ్చాక

ఉద్యోగులకు ఇవ్వాల్సిన బకాయిలు తీర్చాం. సమస్యలు అధిగమించేలా కార్యాచరణ తయారు చేస్తున్నాం. ప్రభుత్వ నిర్ణయాలను అధికార యంత్రాంగం చిత్తశుద్ధితో అమలు చేయాలి. కొత్త రోడ్లు వేశాం. పాడైన రోడ్లకు మరమ్మతులు చేశాం. వచ్చే మూడేళ్లలో అమరావతిని ఒక స్థాయికి తీసుకెళ్తాం. ప్రారంభోత్సవానికి మళ్లీ మూడేళ్లలో రావాలని ప్రధాని మోదీని కోరాం అన్నారు. గోదావరి మిగులు జలాలు రెండు రాష్ట్రాలు వాడుకోవచ్చు. ఏటా 3వేల టీఎంసీలు సముద్రంలోకి పోతున్నాయి. ఎంతగా వాడుకున్న 200 టీఎంసీలు మాత్రమే వాడుకోగలం. బనకచర్ల వద్ద ఎవరికీ ఇబ్బంది లేదు. గోదావరి జలాల వినియోగంతో 2 రాష్ట్రాలు బాగుపడతాయి. రాయలసీమను హార్టీకల్చర్ హబ్‌గా మారుస్తాం. కోస్తాంధ్రను ఆక్వా కల్చర్ హబ్‌గా మారుస్తాం. ప్రజలపై ధరల భారం పడకుండా ఎప్పటికప్పుడు సమీక్ష చేస్తున్నాం. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచితంగా బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తాం.

అదే రోజున ఆటో డ్రైవర్లకు కూడా ఆర్థిక సాయం చేస్తాం. సమాజంలో ఆర్థిక అసమానతలు పెరుగుతున్నాయి. ధనవంతుడు ఇంకా ధనికుడు అవుతున్నాడు. పేదవాడు ఇంకా పేదరికంలోకి వెళు_న్నాడు. మనతో పుట్టినవాళ్లు ఇంకా పేదరికంలోనే ఉన్నారు. సమాజం అండతోపైకి వచ్చినవారు తిరిగి సమాజానికి ఇవ్వాలి. బిల్‌గేట్స్ తన సంపదలో 99శాతం తిరిగి సమాజానికి ఇస్తున్నారు. సరైన సమయంలో సరైన సాయం చేస్తే.. అనేక మంది పైకి వస్తారు. పీ-4ను ఉద్యమ స్ఫూర్తితో ముందుకు తీసుకెళ్లాలని కోరుతున్నా. ఈ కార్యక్రమంలో ధనికులు, పారిశ్రామికవేత్తలు, అధికారులు భాగస్వాములు కావాలి. రూ.9.34 లక్షల విలువైన ఎంవోయూలు చేశాం. కంపెనీలు వస్తే లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయి. పెట్టుబడిదారులకు వివిధ రకాల రాయితీలు ఇస్తున్నాం. వెనుకబడిన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెడుతున్నాం' అని చంద్రబాబు అన్నారు. 'సుపరిపాలనలో తొలి అడుగు' పేరిట ఏడాది పాలనపై జ్యోతి ప్రజ్వలన చేసి ఈ సదస్సును చంద్రబాబు, పవన్ కల్యాణ్, పురంధరేశ్వరి, లోకేష్ ప్రారంభించారు.

www.bhadradrinews.com
భద్రాద్రి న్యూస్

## సంపాదకీయం

# చమురు కష్టలు తప్పవా?

పశ్చిమాసియా పరిస్థితులు దిగజారుతున్నాయి. ఇరాన్‌పై అమెరికా వైమానిక దాడి తరవాత ఉద్రిక్తతలు మరింతగా పెరిగాయి. ఇజ్రాయిల్ చేస్తున్న దాడులకు అమెరికా తోడు కావడంతో ఆజ్యం పోసినట్లు అయ్యింది. దీంతో ఇరాన్ చూస్తూ ఊరుకుంటుందని అనుకోవడానికి లేదు. తన సార్వభౌమాధికారాన్ని కాపాడుకునే ప్రయత్నంలో అది ఎంతకైనా తెగించవచ్చు. ఈ క్రమంలో చమురు రవాణా, ధరలపై ఆందోళన కలుగుతోంది. ఇరాన్‌పై అమెరికా దాడులు, హార్మూజ్ జలసంధి మూసివేత హెచ్చరికలు ఆసియా మార్కెట్‌లపై త్రీవ ప్రభావం చూపిస్తున్నాయి. సోమవారం ముడి చమురు ధరలు 2 శాతానికి పైగా పెరిగి ఐదు నెలల గరిష్ఠాన్ని తాకాయి. ఇరాన్ ప్రతీకార చర్యలపై ఆందోళనలు పతాకస్థాయికి చేరడంతో మార్కెట్లు తీవ్ర ఒడిదుడుకులకు లోనవుతున్నాయి. ఈ క్రమంలో ఇజ్రాయిల్ తన దాడులను కొనసాగిస్తూనే ఉంది. అలాగే ఇరాన్ హెచ్చరికలతో అమెరికాలోని పలు నగరాల్లో అప్రమత్త హెచ్చరికలు చేశారు. దీంతో ఎప్పుడు ఏం జరుగుతుందో అన్న ఆందోళన నెలకొంది. ఈ యుద్ధం సంగతి ఎలా ఉన్నా, ఇది ఇలాగే కొనసాగితే మాత్రం చమురు దిగుమతులతో భారత్ కుదేలవుతుందన్న ఆందోళన నెలకొంది. హార్మూజ్ జలసంధి మూసేస్తారన్న ఆందోళనల నడుమ ముడి చమురు ధరలకు రెక్కలొచ్చాయి. ప్రపంచవ్యాప్తంగా స్టాక్ మార్కెట్‌లు ఒడిదుడుకులకు లోనవుతున్నాయి. అసలు హార్మూజ్ జలసంధి మూసేస్తారా.. ఆ పరిస్థితి తలెత్తితే భారత్‌పై ప్రభావమెంత అనే చర్చలు మొదలయ్యాయి. ఇంధన రంగ నిపుణులు, పరిశీలకులు చెప్పిన దాని ప్రకారం, భారత్ ప్రస్తుతం మధ్య ప్రాచ్యం నుంచే కాకుండా రష్యా, యూఎస్, బ్రెజిల్ నుంచి కూడా చమురును దిగుమతి చేసుకుంటోంది. అనుకోని అవాంతరాలు తలెత్తిన సందర్భాల్లో ఈ దేశాల దిగుమతులతో చమురు లోటును భర్తీ చేసుకునేందుకు ఏర్పాట్లు చేసుకుంది. ప్రస్తుతం ప్రపంచంలో చమురు దిగుమతి, వినియోగంలో భారత్ మూడోస్థానంలో ఉంది. భారత ఇంధన అవసరాల్లో 90 శాతం దిగుమతుల ద్వారానే తీరుతున్నాయి. ఇందులో 40 శాతం మధ్య ప్రాచ్య దేశాల నుంచే అందుతోంది. ఇదంతా హార్మూజ్ జలసంధి మీదుగా భారత్‌కు చేరుతోంది. దిగుమతి చేసుకునే 5.1 మిలియన్ బ్యారెళ్ల ముడి చమురును భారత్ స్వదేశీ రిఫనరీల్లో పెట్రోల్, డీజిల్‌గా శుద్ధి చేసి ప్రజలకు పంపిణీ చేస్తోంది. ఇక మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు మొదలైన నేపథ్యంలో భారత్ రష్యా నుంచి చమురు దిగుమతులను పెంచింది. సౌదీ, ఇరాక్ నుంచి వస్తున్న దిగుమతులతో సమానంగా రష్యా నుంచి ముడి చమురు తెచ్చుకుంటోంది. ప్రస్తుతం రోజుకు 2.1 నుంచి 2.2 మిలియన్ బ్యారెళ్ల రష్యా చమురు భారత్‌కు వస్తోంది. మొత్తం చమురు దిగుమతుల్లో ఇది 35 శాతం. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం మొదలుకాక మునుపు భారత్ మధ్య ప్రాచ్య దేశాల నుంచే చమురును ఎక్కువగా దిగుమతి చేసుకునేది. ఆ తరువాత దిగుమతుల్లో రష్యా వాటా పెరిగింది. అమెరికా ఆంక్షలు, ఐరోపాలో రష్యా ముడి చమురుకు డిమాండ్ తగ్గడం భారత్‌కు కలసి వచ్చింది. మార్కెట్‌లో తక్కువ ధరకే లభిస్తున్న రష్యా ముడి చమురు దిగుమతులను భారత్ క్రమంగా పెంచుకుంది. ఒకప్పుడు 1 శాతానికి కంటే తక్కువగా ఉన్న రష్యా చమురు దిగుమతులు ప్రస్తుతం దాదాపు 40 శాతానికి చేరుకున్నాయని ఇంధనరంగ నిపుణులు చెబుతున్నారు. అమెరికా చమురు దిగుమతులను కూడా భారత్ పెంచుతోంది. నెల వ్యవధిలోనే అమెరికా దిగుమతులు రోజుకు 2.80 లక్షల బ్యారెళ్ల నుంచి 4.93 లక్షల బ్యారెళ్లకు చేరుకున్నాయి. భారత్ సహజ వాయువును ఖతర్ నుంచి అధికంగా దిగుమతి చేసుకుంటోంది. అయితే, ఇవి హార్మూజ్ మీదుగా కాకుండా మరో మార్గంలో భారత్‌కు చేరుతున్నాయి. సహజవాయువును భారత్‌కు సరఫరా చేసే ఆస్ట్రేయా, రష్యా, యూఎస్ కూడా హార్మూజ్ మార్గాన్ని వినియోగించవు. ఇంధన కొరతను తీర్చుకునేందుకు భారత్ తన
వద్ద ఉన్న వ్యూహాత్మక చమురు నిల్వలను వాడుకునే అవకాశం కూడా ఉంది. పది రోజుల దిగుమతులతో సమానమైన ఇంధన నిల్వలు ప్రస్తుతం దేశంలో ఉన్నాయి. పరిస్థితి నుంచి గట్టెక్కేందుకు అమెరికా, బ్రెజిల్ వంటి దేశాల నుంచి దిగుమతులు పెంచుకునే అవకాశం కూడా ఉందని ఇంధనరంగ నిపుణులు చెబుతున్నారు. హార్మూజ్ జలసంధిని మూసివేస్తామని ఇరాన్ హెచ్చరించడంతో ముడి ఇంధన ధరలకు ఒక్కసారిగా రెక్కలొచ్చాయి. సోమవారం ధరల్లో ఏకంగా 2.8 శాతం పెరుగుదల కనిపించింది. తాజా ట్రేడింగ్‌లో యూఎస్ క్రూడ్ ఆయిల్ బ్యారెల్ (ముడి చమురు) ధర 2.8 శాతం మేర పెరిగి 75.98 డాలర్లు చేరుకుంది. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 79.12 డాలర్లు చేరింది. యుద్ధ భయాలు కరెన్సీ మార్కెట్‌లనూ తీవ్ర ఒడిదుడుకులకు లోను చేశాయి.

జపాన్ యెన్‌తో పోలిస్తే అమెరికా డాలర్ మారకం విలువ 0.25 శాతం పెరిగింది. ఇక యూరో మారకం విలువ డాలర్‌తో పోలిస్తే 0.33 శాతం మేర తగ్గింది. కమోడిటీ మార్కెట్‌లో ఔన్స్ బంగారం ధర 0.1 శాతం తగ్గి 3363 డాలర్ల వద్ద కొనసాగుతోంది. ఈ అనిశ్చితిని అమెరికా మార్కెట్లు కొంత తట్టుకున్నట్టే కనిపించాయి. ఎస్ అండ్ పీ ఫ్యూచర్స్ 0.5 శాతం మేర తగ్గగా నాస్‌డాక్ 0.6 మేర నష్టాల్లో ఉంది. ఇక టోక్యో నిక్కీ ఇండెక్స్ 0.6 శాతం మేర, సియోల్ 1.4 శాతం మేర నష్టాల్లో ఉన్నాయి. సిడ్నీ సూచీ కూడా 0.7 నష్టాల్లో పడిపోయింది. ఐరోపాలో యూరోస్టాక్స్ 50 ఫ్యూచర్స్ కూడా 0.7 శాతం నష్టాల్లో ఉన్నాయి. ఎఫ్‌టీఎస్‌ఈ 0.5 శాతం మేర, డాక్స్ ఫ్యూచర్స్ 0.7 శాతం మేర నష్టాన్ని చవిచూసాయి. మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతల నేపథ్యంలో ముడి చమురు ధరలు ఇప్పటివరకూ 76 శాతం మేర పెరిగాయని జేపీ మోర్గన్ ఎనలిస్టులు చెబుతున్నారు. అయితే, హార్మూజ్ జలసంధి మూసివేత జరిగితే బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర 100 డాలర్లకు ఎగబాకినా ఆశ్చర్యపోనక్కర్లేదని కొందరు పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.

# ఇరాన్‌పై దాడులకు అమెరికాలో నిరసనలు

**ప్రజలు రోడ్లమీదకు వచ్చి ఆందోళనలు**

**ఇరాన్ హెచ్చరికలలో పలు నగరాల్లో అప్రమత్తం**



వాషింగ్టన్: ఇజ్రాయెల్‌కు మద్దతుగా.. ఇరాన్‌లోని కీలక అణు స్థావరాలపై అమెరికా వైమానిక దాడులు నిర్వహించడం పట్ల ఆ దేశ ప్రజల్లో తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. ఆ క్రమంలో సోమవారం యూఎస్‌లోని బోస్టన్, వాషింగ్టన్, న్యూయార్క్ తదితర నగరాల్లో ప్రజలు రహదారులపైకి స్వచ్ఛందంగా తరలి వచ్చి ఆందోళనలు చేపట్టారు. ఆ క్రమంలో ఈ యుద్ధంలో ఇజ్రాయెల్‌కు అమెరికా మద్దతు ఇవ్వవద్దని.. ఇరాన్‌ను వదిలి పెట్టాలంటూ వారు ప్లకార్డులు చేత పట్టి బిగ్గరగా నినాదాలు చేశారు.
రాన్‌తో ఉన్న వివాదాన్ని సైతం నిరోధించాలని ఈ సందర్భంగా అమెరికాను వారు కోరారు. అలాగే ఇజ్రాయెల్‌కు మద్దతు ఇవ్వడం మానేయాలని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు సూచించారు. అదే విధంగా ఇరాన్‌తో యూదు దేశం వివాదంలో ఇకపై అమెరికాకు ఎటువంటి ప్రమేయం ఉండకూడదని వారు స్పష్టం చేశారు. అందు కోసం ప్రదర్శనకారులు బ్యానర్లు పట్టుకుని యుద్ధానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఆదివారం ఇరాన్‌లోని మూడు కీలక అణు స్థావరాలపై అమెరికా వైమానిక దాడులు నిర్వహించింది. ఈ నేపథ్యంలో ఇరాన్‌ను వదిలేయాలంటూ అమెరికాకు ఆ దేశ ప్రజలు సూచించారు. బోస్టన్, చికాగోలోని పలు కీలక ప్రదేశాలతో
పాటు వాషింగ్టన్ డీసీలోని అధ్యక్ష భవనం వైట్ హౌస్, న్యూయార్క్‌లోని టైమ్ స్క్వేర్ ఎదుట ప్రజలు ఈ ఆందోళనలు చేపట్టారు. మరోవైపు ప్రజలు ఆందోళనలకు దిగడంతో పలు నగరాల్లో ప్రభుత్వం హై అలర్ట్ ప్రకటించింది. ఈ నేపథ్యంలో సంస్కృతిక, మతపరమైన, దౌత్య కార్యాలయల వద్ద భారీగా భద్రతా బలగాలను మోహరించారు. ఒకోవైపు అమెరికా వైమానిక దాడులపై ఐక్యరాజ్యసమితిలోని ఇరాన్ రాయబారి అమీర్ ఇర్వానీ స్పందారు. ఆ క్రమంలో అమెరికాపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ యుద్ధంలో జోక్యం చేసుకోవద్దని చెప్పినా.. తమ మాటను అమెరికా పెడ చెవిన పెట్టిందని పేర్కొన్నారు. అమెరికాపై ఎప్పుడు.. ఎలాంటి చర్యలు తీసుకోవాలనేది సైన్యం చూసుకుంటుందని ఇర్వానీ స్పష్టం చేశారు. అంతకు ముందు ఇరానీ సుప్రీం కమాండర్ ఖమేనీ మాట్లాడుతూ.. ఇజ్రాయెల్‌పై నిప్పులు చెరిగారు. కానీ ఇరాన్‌లోని అణు స్థావరాలపై వైమానిక దాడులు చేసిన అమెరికాను ఒక్క మాట అనకపోవడం గమనార్హం. ఇరాన్‌లో కీలక అణు స్థావరాలపై అమెరికా వైమానిక దాడులు చేసింది. ఈ నేపథ్యంలో ఇరాన్ స్పందించింది. ఈ దాడులతో దౌత్య సంబంధాలను అమెరికా నాశనం చేస్తుందంటూ ఐక్యరాజ్యసమితిలోని ఇరాన్ రాయబారి అమీర్ సయ్యద్ ఇర్వానీ మండిపడ్డారు. అయితే అమెరికా వ్యవహారాన్ని ఎప్పుడు ఏం చేయాలనేది తమ దేశ సైన్యం చూసుకుంటుందని ఇర్వానీ స్పష్టం చేశారు. అందుకు సంబంధించిన చర్యలు చేపడుతుందని వివరించారు. ఆదివారం ఇరాన్‌లోని ముఖ్య అణు స్థావరాలు.. ఫోర్డో, నటాంజ్, ఇస్ఫహాన్‌పై అమెరికా వైమానిక దాడులు నిర్వహించింది. ఈ నేపథ్యంలో ఐక్యరాజ్యసమితిలోని భద్రతా మండలి అత్యవసర సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా అంతర్జాతీయంగా శాంతి, భద్రతలకు పొంచి ఉన్న ముప్పు అనే అంశంపై చర్చించింది. ఈ సందర్భంగా ఇరాన్ రాయబారి అమిర్ సయ్యద్ ఇర్వానీ మాట్లాడుతూ.. ఈ యుద్ధంలో జోక్యం చేసుకోవద్దంటూ అమెరికాను పదే పదే తాము సూచించినట్లు వివరించారు.
జూన్ 13, జూన్ 21వ తేదీల్లో ఇరాన్‌పై ఇజ్రాయెల్, యూఎస్ నిర్వహించిన దాడులను ఈ సందర్భంగా ఇర్వానీ ఖండించారు. ఈ రెండు దేశాలు అంతర్జాతీయ చట్టాలను అతిక్రమించాయని మండిపడ్డారు. యూఎస్, బ్రిటన్, ఫ్రాన్స్‌తోపాటు
యూరోపియన్ యూనియన్‌లు రాజకీయ, చట్టవిరుద్ధంగా ప్రేరేపించిన చర్యల ఫలితంగా అవి జరిగాయని పేర్కొన్నారు. దౌత్య మార్గాలను ఇజ్రాయెల్ నాశనం చేస్తుందని విమర్శించారు. దౌత్యాన్ని నాశనం చేయాలని ఆ దేశం కంకణం కట్టుకుందంటూ ఇజ్రాయెల్‌పై ఇర్వానీ నిప్పులు చెరిగారు. ఈ సందర్భంగా ఇజ్రాయెల్ ప్రధాని బెంజమెన్ నెతన్యాహు, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుసరిస్తున్న వైఖరిపై ఇర్వానీ ఆగ్రహం వ్యక్తం చేశారు. దౌత్య సంబంధాలును అమెరికా నాశనం చేయాలని నిర్ణయించుకుందని గత వారం పలు యూరోపియన్ సభ్య దేశాలతో ఇరాన్ విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి

# పశ్చిమాసియా ఉద్రిక్తలపై ఐరాస అత్యవర భేటీ

**అమెరికా దౌత్యా నీతిని దెబ్బతీసిందని ఇరాన్ వెల్లడి**

**యుద్ధం లక్ష్యాలు నెరవేరాయన్న నెతన్యాహు**

**టెల్ అవీవ్:** ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధం, అమెరికా రణరంగంలోకి దిగడంతో
పశ్చిమాసియా రగులుతోంది. మరోవైపు పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులపై ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి అత్యవసర సమావేశం నిర్వహించింది. అందులో ఐరాసలో ఇరాన్ రాయబారి అమీర్ సయిద్ ఇరవానీ మాట్లాడుతూ.. 'అమెరికా విదేశాంగ విధానాన్ని హైజాక్ చేసి.. నెతన్యాహు అగ్రరాజ్యాన్ని ఈ యుద్ధంలోకి లాగారు. అమెరికా చరిత్రలో ఇది మాయని మచ్చగా మిగిలిపోనుంది. దౌత్యాన్ని నాశనం
చేయడానికి అగ్రరాజ్యం కంకణం కట్టుకుంది. దీనికి సరైన సమయంలో దీటుగా బదులిస్తాం' అని హెచ్చరించారు. ఈ ఉద్రిక్తతల వేళ ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు కీలక ప్రకటన చేశారు. టెహ్రాన్‌తో సుదీర్ఘ యుద్ధం ఉండబోదని అన్నారు. 'ఆపరేషన్ రైజింగ్ లయన్' పేరుతో తాము చేపట్టిన దాడుల్లో లక్ష్యానికి చేరువైనట్లు వెల్లడించారు. ప్రస్తుత ఇరాన్ పాలకులు మమ్మల్ని తుడిచిపెట్టాలని చూశారు. అందుకే ఈ ఆపరేషన్ చేపట్టాల్సి వచ్చింది. ఇందులో ప్రధానంగా మా అస్థిత్వానికి పొంచి ఉన్న రెండు ముప్పులను తొలగించాలనుకున్నాం. ఒకటి అణ్వాయుధాలు.. రెండు బాలిస్టిక్ క్షిపణులు. ఈ లక్ష్యాలను సాధించే దిశగా మేం ఒక్కో అడుగు వేస్తూ ముందుకుసాగుతున్నాం. వాటికి మేం చేరువయ్యాం. టెహ్రాన్‌తో సుదీర్ఘకాలం యుద్ధం కొనసాగించబోం' అని ఇజ్రాయెల్ ప్రధాని వెల్లడించారు. అయితే, అనుకున్న ఫలితం రాకముందే పోరాటం నుంచి నిష్క్రమించేది లేదని ఆయన స్పష్టం చేశారు. ఇరాన్ ÷-పై అమెరికా బాంబు దాడులు చేసిన అనంతరం నెతన్యాహు మీడియాతో మాట్లాడారు. 'టెహ్రాన్‌లోని ఫోర్డో అణుకేంద్రాన్ని అమెరికా తీవ్రంగా ధ్వంసం చేసింది. అణ్వాయుధ కార్యక్రమంలో ఇరాన్‌ను వెనక్కి నెట్టాం. ముప్పును తొలగించుకున్నాం. లక్ష్యాలను సాధించడానికి అవసరానికి మించి మా చర్యలను కొనసాగించబోం. మా గ్గెట్‌ను చేరుకుంటే ఆపరేషన్ పూర్తయినట్లే. అప్పుడు యుద్ధం కూడా ఆగుతుంది. ఇజ్రాయెల్‌కు మద్దతుగా ఇరాన్ అణుశుద్ధి కేంద్రాలే లక్ష్యంగా అమెరికా క్షిపణులు, బాంబర్లతో విరుచుకుపడిన సంగతి తెలిసిందే. ఈ పరిణామాలపై ఇరాన్ సుప్రీంలీడర్ అయతొల్లా అలీ ఖమేనీ తీవ్రంగా స్పందించారు. 'యూదు శత్రువులు ఘోర తప్పిదం చేశారు. తీవ్ర నేరానికి పాల్పడ్డారు. దీనికి శిక్ష తప్పదు. తక్షణమే శిక్షించాల్సిన అవసరం ఉంది' అని పోస్ట్ చేశారు. అయితే, ఇందులో అమెరికా ప్రస్తావనను ఆయన తీసుకురాకపోవడం గమనార్హం. అమెరికా దాడులను ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ తీవ్రంగా ఖండించారు. దీనికి అగ్రరాజ్యం మూల్యం చెల్లించుకోవాల్సిందేనని హెచ్చరించారు. దాడుల అనంతరం ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్‌తో ఆయన ఫోన్‌లో మాట్లాడారు. అమెరికాకు దీటుగా బదులిస్తామని పెజెష్కియాన్ తెలిపారు.

# కేంద్ర నూతన పెన్షన్ చట్టం ఉపసంహరించాలి




**ఖమ్మం ప్రతినిధి, జూన్ 23( భద్రాద్రి న్యూస్):-**

లక్షలాది పెన్షనర్ల భవిష్యత్తు కు తూట్లు పొడుస్తూ, పెన్షనర్లను విభజిస్తున్న కేంద్రప్రభుత్వ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని పెన్షనర్ల జేఏసినేతలు పరిశపు ల్లయ్య, మధుసూదన్ రావు, ఎస్ రంగారావు, జెల్లా వెంకటేశ్వర్లు, రాయలరవికుమార్ డిమాండ్ చేసారు.
సోమవారం కృషిభవన్ లో పరిశపుల్లయ్య అధ్యక్షతన జరిగిన పెన్షనర్ల జేఏసి సమావేశంలో మాట్లాడిన వక్తలు పెన్షనర్లకు కేంద్రచట్టం ద్వారా పెనుప్రమాదంపొంచిఉన్నదని దానిని ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల మధ్య ఐక్యత సాధించాలని కోరారు. ప్రధానమంత్రి ని కోరుతున్న విజ్ఞాపనపత్రాన్ని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల జెఏసి నాయకత్వం లో నేడు జిల్లా కలెక్టర్ కు అందజేయడం జరిగింది. ఏఐయస్ పియఫ్ పిలుపుమేరకు తెలంగాణ ప్రభుత్వ పెన్షనుదారుల సంయుక్త కార్యాచరణ సమితిప్రతినిధిబృందం జిల్లా కలెక్టర్ కు సంతకాలతో కూడిన విజ్ఞాపన పత్రం అందించిందిప్రతినిధిబృందంలో పరిశపుల్లయ్య, రాయలరవికుమార్, యం.మధుసూదనరావు, యస్.రంగారావు,కొర్లపాటిబాబు,జె. వెంకటేశ్వర్లు, లక్ష్మి సుజాత, మేరిఏసుపాదం,తాడిఅంజలి, భాస్కరాచారి, శరత్ బాబు,గుర్రాలశ్రీనివాసరావు పివిఆర్కెప్రసాదరావు, వీరభద్రరావు, పెదమళ్ళసత్యం ఊడుగువెంకటేశ్వర్లు,రామనాధం, అల్లికనర్సయ్య, వివిఅప్పారావు తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ పలు ప్రాంతాల్లో వర్షం

హైదరాబాద్: హైదరాబాద్ మహానగరంలో పలు ప్రాంతాల్లో సోమవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. పలు ప్రాంతాల్లో వర్షం దంచి కొట్టింది. దీంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయి. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. గత కొద్దిరోజుల నుంచి వాతావరణం చల్ల బడింది. కొంత సేపు ఎండలు పెట్టినా.. మిగితా సమయం మబ్బులు కమ్ముకుం టున్నాయి. ఈ నేపథ్యంలోనే సోమవారం పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది నేడు మంచిర్యాల, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మేడ్చల్, రంగారెడ్డి, హైదరాబాద్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఉరుములు మెరుపులతో పాటు ఈదురుగాలుల ప్రభావం ఉంటుందని పేర్కొంది. నిజామాబాద్ జిల్లాలో కూడా గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులతో వర్షాలు పడే అవకాశముందని వెల్లడించింది. ఈ మేరకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. ప్రస్తుతం నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయి. ఇవి కశ్మీర్, సిమ్లా మీదుగా హిమాలయాల వరకు విస్తరిస్తుండగా, మరో రెండు మూడు రోజుల్లో దేశమంతటా వ్యాపించనున్నాయని భారత వాతావరణశాఖ, విశాఖపట్నం తెలిపింది. ఈ సారి రుతుపవనాల వ్యాప్తి మాములు కంటే సుమారు 15 రోజులు ముందుగానే వచ్చాయని తెలిపింది.
ఈ నేపథ్యంలో నైరుతి బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడడంతో, 5.8 నుండి 7.6 కిలోమీటర్ల పైన ఆవరించడంతో.. దీనివల్ల రాబోయే రెండు
రోజులు వర్షాల సూచన ఉండనుంది. ఉత్తర కోస్తాంధ్రలో ఒకటి రెండు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు.

# రైతు సదస్సు వీక్షించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.**

**భద్రాద్రి కొత్తగూడెం ,జూన్ 23 (భద్రాద్రి న్యూస్):-**

రైతు భరోసాలో భాగంగా రాష్ట్రంలోని వ్యవసాయ యోగ్యమైన అన్ని భూములకు రైతు భరోసా 9000 కోట్ల రూపాయలు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసిన సందర్భంగా ప్రభుత్వం సచివాలయం వద్ద నిర్వహించే రైతు సదస్సులో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి రైతులను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఇట్టి కార్యక్రమాన్ని జిల్లాలో ని రైతు వేదికల నుండి రైతులు ప్రత్యక్షంగా వీక్షించే విధంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఉన్న 58 రైతువేదికలలో రైతు సదస్సులు ప్రత్యక్షంగా వీక్షించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. మంగళవారం అన్ని రైతు వేదికలను పండుగ వాతావరణం లో మామిడి తోరణాలు, రంగవల్లులతో అలంకరించాలని అధికారులను ఆదేశించారు. మంగళవారం నాలుగు గంటలకే రైతు వేదిక వద్దకు రైతులు చేరుకునేలా చర్యలు చేపట్టాలని అన్నారు. ఆడియో మరియు వీడియోలో ఎటువంటి సాంకేతిక లోపాలు తలెత్తకుండా సరిచూసుకోవాలన్నారు. రైతు వేదికలకు విచ్చేసే రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి



చేయాలన్నారు. మహిళా రైతులు కూడా పెద్ద ఎత్తున హాజరు అయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజాప్రతినిధులకు ఆహ్వానాలు పంపాలని అధికారులకు సూచించారు. ప్రతి రైతు వేదికలో రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ మరియు మండల స్థాయిలో ఎంత మంది రైతులకు ఎంత మొత్తంలో రైతు భరోసా జమ అయినదో వివరాలను అందుబాటులో ఉంచాలన్నారు. ప్రతి రైతు వేదిక వద్ద పెద్ద సంఖ్యలో రైతులు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతు వేదికల వద్ద హాజరైన రైతుల వివరాలను నమోదు చేసి నివేదికలు అందించాలని అధికారులను ఆదేశించారు.

# పరిహారం చెల్లించండి మహా ప్రభో



### 2017లో కొండమొదలు పెద్దలతో ప్రభుత్వం కుదుర్చుకున్న ఎంవోయు ప్రకారం నిర్వాసిత గిరిజనులకు 426 ఎకరాల భూమిని తక్షణమే ఇవ్వాలి

### కత్తనాపల్లి గ్రామంలోని 86 కుటుంబాలకు వెంటనే నష్టపరిహారం అందించాలి

ఆర్కే..ఎటపాక ప్రతినిధి, జూన్ 23 (భద్రాద్రిన్యూస్):-

పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులైన కొండమొదలు పెద్దలతో ప్రభుత్వం 2017లో కుదుర్చుకున్న ఎంఓయు ప్రకారంగా ఆదివాసులకు నష్ట పరిహారాన్ని చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం నుంచి కొండ మొదలు పంచాయతీ సర్పంచ్ వేట్ల విజయ రంపచోడవరం లోని ఐటిడిఏ ఆఫీస్ ముందు నిరసన దీక్షను చేపట్టారు. ముందుగా రంపచోడవరం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి ఐటీడీఏ కార్యాలయం వరకు కొండ మొదలు పంచాయతీ గిరిజనులు ర్యాలీగా వచ్చారు. అనంతరం ఏజెన్సీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ ఇల్లా రామిరెడ్డి వేట్ల విజయ కి ఎర్ర కండువాను వేసి దీక్షను ప్రారంభించారు.ఆయన మాట్లాడుతూ... మన సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకూ పోరాడాలని, పోరాటం తప్ప మరొక మార్గం లేదని అన్నారు.

ఈ దీక్షకు ఏజెన్సీ గిరిజన సంఘం నాయకులు వంజం జోగారావు అధ్యక్షత వహించగా.. ప్రధాన వక్త రైతుకూలీసంఘం(ఆం.ప్ర) రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ దంతులూరి వర్మ మాట్లాడుతూ "పోలవరం ప్రాజెక్టు శంకుస్థాపన చేసి రెండు దశాబ్దాలు గడుస్తున్నా ఇంకా నిర్వాసితుల సమస్యలు పరిష్కారం కాలేదు. ఏ ప్రాజెక్టు నిర్మించినా ఆ ప్రాజెక్టు వలన నిర్వాసితులవుతున్న వారందరికీ నష్టపరిహారాన్ని చెల్లించిన తర్వాతనే ప్రాజెక్టును మొదలు పెట్టాలని చట్టంలో ఉన్నా సరే ప్రభుత్వం బలవంతంగా ప్రజలను ఆ ప్రాంతం నుంచి గెంటివేస్తుంది. పోలవరం ప్రాజెక్టు మొదలుపెట్టి పూర్తి నష్టపరిహారం చెల్లించకుండా బలవంతంగా గెంటివేసిన వాళ్లలో కొండ మొదలు పంచాయతీ ప్రాంత ప్రజలు కూడా ఉన్నారు. వీరు ప్రాజెక్టు శంకుస్థాపన చేసిన దగ్గర నుంచి కూడా తమకు పూర్తి నష్టపరిహారం కావాలని పోరాడుతున్న క్రమంలో 2017 జూన్ 22వ తారీఖున కొండమొదలు పెద్దలతో ప్రభుత్వం అవగాహన ఒప్పందం చేసుకుంది. 8 సంవత్సరాలు గడిచిన ఇప్పటికి రాజకీయ నాయకులు గానీ ప్రభుత్వ అధికారులు గానీ పట్టించుకోవడం లేదు. తక్షణమే ఈ తొలకరికి భూమి అప్పగించాలని, పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులందరికీ భూమి,అడవి సంపూర్ణమైన పునరావాసం ఇవ్వాలని, 2013 భూసేకరణ చట్ట ప్రకారం నిర్వాసితుల సమస్యలన్నీ పరిష్కరించాలని, కొండ మొదలు నేలదోనెలపాడు (ఆర్%డ%ఆర్ కాలనీ) ఆదివాసీ నిర్వాసితులకు ప్రభుత్వం ప్రత్యేకంగా అమలు చేయాల్సిన హామీలను అమలు కోసం కొండ మొదల పంచాయతీ సర్పంచ్ వేట్ల విజయ గారు చేపట్టిన నిరసన దీక్షకు మద్దతును తెలియజేయాలని, వారి పోరాటంలో భాగస్వాములమవుదామని" పిలుపునిచ్చారు. కొండ మొదలు సర్పంచ్ వేట్ల విజయ గారు మాట్లాడుతూ కత్తనాపల్లి గ్రామంలోని 86 కుటుంబాలకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని, ఈ దీక్షకు మద్దతుగా రేపు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కలెక్టర్ కార్యాలయాల వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టాలని రైతు కూలీ సంఘం (ఆం.ప్ర.) ఆధ్వర్యంలో పిలుపునిచ్చామని దానికి మిగతా అన్ని వామపక్ష, గిరిజన, ఆదివాసీ సంఘాల నాయకులు, మేధావులు, ప్రజాతంత్ర వాదులు అందరూ పాల్గొని పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలు పరిష్కారం కోసం అండగా మద్దతుగా నిలబడమని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి కుంజా దూలన్నా, ఏపీ రైతు కూలీ సంఘం ఉమ్మడి గోదావరి జిల్లా అధ్యక్షులు వల్లూరి రాజబాబు, సిపిఎం అల్లూరి జిల్లా కార్యదర్శి ఉప్పెన కిరణ్, సిపిఐ నాయకులు కుమార్, హ్యూమన్ రైట్స్ వాచ్ నాయకులు బాలు అక్కిసా, ఎన్జీవో సంఘం అధ్యక్షులు బొర్రా అజయ్ కుమార్, హ్యూమన్ రైట్స్ ఫోరమ్ నాయకులు రాజేష్, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు సిరిమల్లి రెడ్డి, పి ఓ డబ్ల్యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనసూయ, పిడిఎస్ఓ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.భాస్కర్, పిడిఎస్యు నాయకులు కిరణ్, ఏజెన్సీ గిరిజన సంఘం నాయకులు వేట్ల సత్యన్నారాయణ తదితర సంఘాల నాయకులు , పోలవరం ప్రాజెక్టు నిర్వాసిత గ్రామాల నుండి 200 మంది ప్రజలు పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీ పరిధిలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

### బిఆర్ఎస్ 4 ఇంక్లైన్ ఇంచార్జ్ బానోత్ రాము నాయక్

కొత్తగూడెం అర్బన్, జూన్ 23 ( భద్రాద్రి న్యూస్ )



కొత్తగూడెం జిల్లా, చుంచుపల్లి మండలంలోని 4 ఇంక్లైన్ గ్రామపంచాయతీ పరిధిలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ బిఆర్ఎస్ నాయకులు సోమవారం గ్రామపంచాయతీ కార్యదర్శి నర్మదకు వినతిపత్రం అందజేశారు. ఈ వినతిపత్రాన్ని బిఆర్ఎస్ 4 ఇంక్లైన్ ఇంచార్జ్ బానోత్ రాము నాయక్ ఆధ్వర్యంలో సమర్పించారు. ఈ సందర్భంగా రాము నాయక్ మాట్లాడుతూ... ఈ కార్యక్రమం మాజీ మంత్రి, నియోజకవర్గ ఇంచార్జ్ వనమా వెంకటేశ్వరరావు ఆదేశాలతో చేపట్టామని తెలిపారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజలకు ఇచ్చిన హామీలను ఇప్పటికీ అమలు చేయలేదని ఆరోపించారు. గ్రామాల్లో పలు సమస్యలు కొనసాగుతున్నాయని, వాటిని వెంటనే పరిష్కరించాల్సిన అవసరం ఉందని అన్నారు. అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని, సైడు కాల్వలలోని చెత్త, పిచ్చిమొక్కలను తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లాలని డిమాండు చేసారు. మంచినీటి బావుల్లో నీటి నిల్వ ఉన్నచోట తక్షణమే శానిటేషన్ చర్యలు చేపట్టాలని సూచించారు. వీధి లైట్లు వెంటనే అమర్చాలని, ఇళ్లలో చెత్తను ప్రతిరోజూ సేకరించి డంపింగ్ యార్డుకు తరలించాలని అన్నారు. దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలి అన్నారు. పైలట్ ప్రాజెక్టుగా చేపట్టిన గ్రామాలలో ఉన్న పలు కీలక సమస్యలను పరిష్కరించాలని కోరారు. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలు కేవలం మాటలకే పరిమితమయ్యాయని, ప్రజలను మోసం చేసి, వారి జీవితాలతో ఆడుకుంటూ పాలనను నిర్లక్ష్యంగా

వదిలేస్తున్నారని తీవ్రంగా విమర్శించారు. ఈ కార్యక్రమంలో నూనావత్ వస్య, నూనావత్ తార, నూనావత్ వెంకటేష్, భూక్య ధనరాజ్, బానోత్ నందు, బానోత్ పండు, సురేష్, రామంచి శ్రీనివాస్ తదితర బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# డాక్టర్ చింతం ప్రవీణ్ కుమార్‌కు సన్మానం



### విద్యా వేత్తలు రాజకీయాల్లోకి రావాలి

### ఆల్ ఇండియా ఒబిసి జాక్ చైర్మన్ సాయిని నరేందర్

వరంగల్ ,జూన్ 23 (భద్రాద్రి న్యూస్):-

విద్యా వేత్తలు రాజకీయాల్లోకి వచ్చినప్పుడే భారతదేశంలో విలువల పాలన నిర్మితమవుతుందని ఆల్ ఇండియా ఒబిసి జాక్ చైర్మన్ సాయిని నరేందర్ అన్నారు. బహుజన ఉద్యమకారుడు డాక్టర్ చింతం ప్రవీణ్ కుమార్ యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల తెలుగు విభాగాధిపతిగా నియామకం అయిన సందర్భంగా ఆల్ ఇండియా ఒబిసి జాక్ హనుమకొండ జిల్లా అధ్యక్షులు తాడిశెట్టి క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో సోమవారం ఆర్ట్స్ కళాశాలలో జరిగిన చింతం ప్రవీణ్ కుమార్ కు సన్మానం చేసి ఆయన మాట్లాడారు. చిన్న వయసు నుండే పేదరికంతో పోరాడి ఉన్నత చదువులు చదివి విద్యతో పాటు సామాజిక ఉద్యమాలు, తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన ప్రవీణ్ కుమార్ రచయితగా, కవిగా ఎదిగి నేటి యువతకు ఆదర్శంగా నిలిచి కాకతీయ యూనివర్సిటీలో అంచెలంచెలుగా ఎదిగి నేడు ఆర్ట్స్ కాలేజ్ తెలుగు విభాగానికి విభాగాధిపతిగా నియమితులైన సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలిపారు. తన వృత్తిలో రాణిస్తూనే ప్రజలను చైతన్యం చేసి విలువల రాజకీయ నిర్మాణానికి తన వంతు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో బీసీ ఉద్యోగ సంఘాల రాష్ట్ర నాయకులు బుసగొండ ఓంకార్, బీసీ జాతీయ నాయకుడు చాపర్తి కుమార్ గాడ్గే, ఆలిండియా ఓబీసీ జాక్ వైస్ ప్రెసిడెంట్ లు వల్లాల జగన్ గౌడ్, రాసమల్ల శ్రీనివాస్ సగర, నారాయణగిరి రాజు, నలుబాల రవికుమార్ సగర, ఆకారపు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# అగ్రవర్ణాల బడులలో, బీసీ, ఎస్సీ ,ఎస్టీ బిడ్డల చదువులు

## చదువుకు, ఓటుకున్న సంబంధం

భద్రాద్రి న్యూస్ , కాలమిస్ట్



కాయ కష్టం చేసి సంపాదించిన డబ్బులను చదువుల కోసం అగ్రవర్ణాల బడుల్లో పెడుతున్నాంప్రభుత్వం బడులను బలహీనపరిచింది ఈ ప్రైవేటు విద్యాసంస్థలే. వేల ఏండ్లుగా కార్పొరేట్ ఇంగ్లీష్ మీడియం, విద్యాసంస్థలను నెలకొల్పింది భారతదేశంలో అగ్రవర్ణాల వారే, డబ్బు పెట్టి చదువుకునేది మన ప్రజలు. కార్పొరేట్ వ్యవస్థకు దాసోహం అంటున్న ప్రభుత్వాలు. మరి ఎప్పుడు చూస్తాము మార్పు.

చదువు పేదవాడిని ఉన్నత స్థాయిలో నిలబడుతుందని చెప్పడానికి ఉదాహరణ ఈ దేశ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మరొకరు అబ్దుల్ కలాం, మాజీ ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియా. ఇలా తెలిసి తెలియకుండా ఎంతో మంది మోహినిలు మన మధ్యలో వచ్చారు వెళ్లి వారి జీవితం అంటరానితనం మధ్య కటిక పేదరికం మధ్య జరిగింది, ప్రతి ఒక్కరూ కడుపు మార్చుకుని చదువును ప్రేమించి చదివే తమ జీవితంగా బతికారు అందుకే ఆ స్థాయి వరకు ఎదిగారు చదువు నేటి సమాజంలో అత్యవసరమైనది నిన్నటి మన జీవితం ఎలా ఉన్నప్పటికీ రేపటి భవిష్యత్తు చదువుతో మార్పులు నాంది పలుకుతుంది.

అలాంటి చదువు ఈరోజు కార్పొరేట్ వ్యవస్థల చేతిలోకి వెళ్లిపోతుంటే చూస్తూ ఊరుకుంటున్న ప్రభుత్వాలను చూసి సిగ్గుపడాల్సిన అవసరం, ప్రజలు ప్రజాస్వామ్యవాదులు కమ్యూనిస్టులు లెఫ్ట్ లు రైట్లు అందరూ ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకుందాం అని ఉద్యమాలు చేస్తున్న వాళ్లు సైతం, పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలలో మరీ ముఖ్యంగా కార్పొరేట్ విద్యాసంస్థల్లో మిగిలిన పేదవారులను మాత్రం గవర్నమెంట్ బడుల్లో చదువుకోమని ఉపదేశాలు చేస్తున్నారు, గవర్నమెంట్ ఉపాధ్యాయులు వారి పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తూ, అత్యాధునికమైన చదువులతోటి వారిలో నైపుణ్యాలు పెంచుతూ వారి పిల్లల్ని విదేశాల వైపు పంపే ఆలోచనలో వారు ఉంటే మనం మన పిల్లలు కనీసం పదో తరగతి ఇంటర్ పాసై ఏ చిన్న ఉద్యోగమైన చేసుకొని బతకగలుగుతారని ఆలోచనలో మనం ఉంటున్నాం. ఇక ప్రభుత్వ పాఠశాలలను బలహీన పరుస్తున్నది ఎవరు అంటే కార్పొరేట్ వ్యవస్థ ఏ కార్పొరేట్ వ్యవస్థ అయితే వేల రూపాయలను మన దగ్గర నుండి దోచుకుంటుందో ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ బిడ్డలను తమ విద్యార్థులుగా చేర్చుకొని వారు కట్టే ఫీజులతో వీళ్ళు పౌలు అంతస్తులను వేలకోట్ల వ్యాపారాలను చేస్తూ ఈ సమాజంలో పెద్దలుగా చలామణి అవుతూ రాజకీయాలతో ముడిపడి ఆ రాజకీయ నాయకులతో ఈ పాఠశాలలను బలహీన పరుస్తున్నారు, దీనికి ఉదాహరణగా శ్రీమంతుడు అనే సినిమాలో హీరోతో ఒక ఊరిని దత్త తీసుకొని ఆ ఊరుని బాగు చేయడానికి చేసే ప్రయత్నంలో పాఠశాలలను కట్టేందుకు ప్రయత్నం చేస్తుంటాడు ఆ సినిమాలో ఉన్న విలన్ తమకు ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయని ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటే నీకు చదువు రాదని డబ్బులు కట్టి మా పాఠశాలలో చేర్చుకోమని ఉచిత సలహాలు ఇస్తాడు ఇదే నేటి సమాజంలో జరుగుతున్నది. ఈరోజు రాజకీయాలను శాసిస్తున్నటువంటి ప్రజాప్రతినిధులు ప్రైవేట్ కార్పొరేట్ వ్యవస్థలో భాగస్వాములై ఉన్నారు. అందుకే ప్రభుత్వాలు ప్రభుత్వ పాఠశాలలను కాలేజీలను నిర్వీర్యం చేస్తే ప్రయత్నంలో ఉన్నాయి ఒకవైపు ప్రభుత్వ ఉద్యోగాలు లేకుండా చేస్తూ ప్రభుత్వ సంస్థలను ప్రైవేటీకరణ వైపు మారుస్తున్నాయి ఈ దేశ ప్రభుత్వాలు దానికి అడుగులు వేస్తూ రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థలో ప్రైవేటైజేషన్ ని ప్రోత్సహిస్తున్నాయి ఇదే కొనసాగితే మధ్యతరగతి పేదవాడు చదువుకు దూరంగా వలసిన పరిస్థితి వస్తుంది ముఖ్యంగా 80% ఉన్నటువంటి బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీలు తమను చదువుకునే స్థితి నుండి మళ్లీ బానిసత్వం వైపు నెట్ వేయబడతారు రోజురోజు పెరుగుతున్న ధరలను చూస్తే చదువుని కొనుక్కొని చదువుకునే స్థితికి వచ్చామనేది అర్థం అవుతుంది ఈ వ్యవస్థను మార్చాలంటే ప్రజల్లో చైతన్యం రావాలి. మరీ ముఖ్యంగా ప్రజాస్వామ్యవాదులు పూలే అంబేద్కర్ వారసులు విద్యా వ్యవస్థ పైన పెద్ద ఎత్తున పోరాటం చేసి ప్రభుత్వ పాఠశాలను కాపాడుకోవాలి ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్నట్టు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు తమ కర్తవ్యాన్ని అంతర్గత శుద్ధితో నిర్వహిస్తూ తమ వృత్తికి న్యాయం చేస్తే కచ్చితంగా ఏదో ఒక రోజు ప్రభుత్వం పాఠశాలలు బలోపేతం అవుతాయి ఢిల్లీలో కేజీలు వాళ్ళ లాంటి నాయకుడు ఒక ప్రయోగం చేసి కార్పొరేట్ వ్యవస్థ లాంటి భవనాలు విద్యా వ్యవస్థను ప్రైవేట్ స్థాయిలో కాకుండా ప్రభుత్వ స్థాయిలో నిలబెట్టి దేశానికి ఆదర్శంగా నిలిచారు అలాగే మిగిలిన రాష్ట్రాలు కూడా చేస్తే ఈ దేశం పేద మధ్యతరగతి నుండి వేలాదిమంది అంబేద్కర్లను, అబ్దుల్ కలాం లను ఎంతో మందిని తీర్చిదిద్దే అవకాశం ఉందని మనస్ఫూర్తిగా కోరుకుంటూ ధన్యవాదాలు.

**తాడిశెట్టి క్రాంతి కుమార్**
తెలంగాణ జిల్లాల పూలే యువజన సంఘం రాష్ట్ర కన్వీనర్

# కొత్తగూడెంలో మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద బీఆర్ఎస్ ధర్నా



కొత్తగూడెం అర్బన్, జూన్ 23 ( భద్రాద్రి న్యూస్ )



భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీ ఆధ్వర్యంలో సోమవారం కొత్తగూడెం కార్పొరేషన్ కార్యాలయం ఎదుట విస్తృత నిరసన ధర్నా చేపట్టారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు ఆదేశాలు, మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు సూచనల మేరకు జరిగిన ఈ ధర్నాకు కొత్తగూడెం మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి నేతృత్వం వహించారు. ఈ సందర్భంగా సీతాలక్ష్మి మాట్లాడుతూ, గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా, అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాను నోటీస్ బోర్డుపై ప్రదర్శించాలనీ, పారదర్శకత పాటించాలని కోరారు. పారిశుద్ధ్య పరిస్థితులు తీవ్రంగా దిగజారినట్లు ఆరోపణలు చేస్తూ, కార్పొరేషన్ పరిధిలో తక్షణమే మట్టికూడిన డ్రైనేజీలను శుభ్రం చేయాలని, దోమల నివారణ చర్యలపై దృష్టి పెట్టాలని కోరారు. వీధిదీపాలు ఏర్పాటు చేయాలని, మిషన్ భగీరథ పథకం కింద తవ్విన గుంటల వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని వాటిని వెంటనే పూడ్చాలని డిమాండ్ చేశారు. హరితహారం కార్యక్రమాన్ని తిరిగి ప్రారంభించాలని అన్నారు. పచ్చదనాన్ని పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టాలని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హరితహారాన్ని పూర్తిగా మరిచారని ఆమె విమర్శించారు. వెంటనే మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించాలని సూచించారు. ధర్నా అనంతరం కార్పొరేషన్ మేనేజర్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు ప్రసాద్, పల్లపు రాజు, మైనారిటీ సెల్ నాయకులు ఖాజా భక్ష్, మునీర్, హుస్సేన్, ఎస్సీ సెల్ రామిళ్ళ మధు, ఎస్టీ సెల్ నాయకులు పూర్ణచందర్, అజ్మీరా విజయ్, రాజ మల్లయ్య, షమ్మీ, మొయినుద్దీన్, సూరి, అశోక్, నగేష్, బాబు జానీ, నాగరాజు, మజీద్, అన్వర్ ఖాజా, తుంగ కనకయ్య, ఆర్. శ్రీనివాస్, శ్రీదేవి, శైలజ, కోమల, శ్రీనిజ, సుందర్ పాసి, టింకు, సోనీ పాసి, సౌజన్య, ఆశ, మాధవి, స్వర్ణ, లక్ష్మి, కమల, విజయ, జి విజయ, సుహాని, మహేశ్వరి, రమణ, శ్రావణ్, నసీమా, మహబూబ్, షేక్ బాజీ, షేక్ బిబి, సత్యవతి, ఖంరున్నిసా, షణ్ముఖ, సిద్ధు, బన్ను, అమన్ తదితరులు పాల్గొన్నారు.

# ఆపదలో ఉన్నాం.. ఆదుకోండి సారూ..

అశ్వారావుపేట, జూన్ 22(భద్రాద్రిన్యూస్ ):-

నిరుపేద కుటుంబానికి పెద్ద ఆపద వచ్చింది. కుటుంబపెద్ద అనారోగ్యంతో మంచానికి పరిమితమయ్యాడు. ఆయన పనిచేస్తేనే ఇల్లు గడిచేది. దీంతో ఆకుటుంబ పరిస్థితి దయనీయం మారింది .లక్షల వైద్య ఖర్చులు భరించలేక దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అశ్వారావుపేట మండలం నందిపాడు గ్రామానికి చెందిన సవలం.కాంతారావు కూలి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. భార్య సవలంసమ్మక్క ,క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న సవలం.కాంతారావు గత నెలలో ఖమ్మం,హైదరాబాద్ బసవతారక మరికొన్ని ప్రైవేట్ ఆస్పత్రిలో చేరాడు. రెండు కిడ్నీలు పూర్తిగా చెడిపోయాయని, క్యాన్సర్ ముదిరిందని డాక్టర్లు చెప్పారు. ఈ ఆపరేషన్లకు సుమారు రూ. 5లక్షలకు పైగా ఖర్చు అవుతుందని చెప్పారు. తాను పని చేస్తేనే ఇల్లు గడిచే పరిస్థితి ఉందని, ఇంత ఖర్చుతో వైద్య ఎలా చేయించుకోవాలో పాలు పోవడంలేదు. ఇప్పటికే వైద్యానికి రూ.80 వేలు ఖర్చు చేశామని సవలం సమ్మక్క భార్య తెలిపింది. ఆమే భర్త కి అన్నీతానై సేవలు చేస్తోంది. తన భర్త ని కాపాడాలని దాతలను వేడుకుంటోంది. ఫోన్ నంబర్ 8500917079 ఫోన్



పే ఉందని, దాతలు కరుణించి ఆదుకోవాలని సవలం.సమ్మక్క కోరుకుంటుంది.

# సీజనల్ వ్యాధుల నియంత్రణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలి

**జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**

**హాట్ స్పాట్ లలో ప్రత్యేక పారిశుధ్య చర్యలు**

**ప్రతి రోజూ పిల్లలకు పాఠశాల ప్రేయర్ సమయంలో వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన**

**సీజనల్ వ్యాధుల నియంత్రణపై సంబంధిత అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్**



**ఖమ్మం ప్రతినిధి, జూన్ 23( భద్రాద్రి న్యూస్):-**

సీజనల్ వ్యాధుల నియంత్రణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. జిల్లా కలెక్టర్, కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నాడు, అదనపు కలెక్టర్ లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి లతో కలిసి సీజనల్ వ్యాధుల నియంత్రణపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. జిల్లాలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డా. బి. కళావతి బాయి వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు అధికంగా గ్రామీణ, ఏజెన్సీ ప్రాంతాల్లో వచ్చే అవకాశం ఉందని, వీటి నియంత్రణకు ప్రణాళిక ప్రకారం పని చేయాలని తెలిపారు. సీజనల్ వ్యాధులు అధికంగా అవగాహన లేకుండా ఉండడం వలన, సరైన పారిశుధ్యం లేని ప్రాంతాలలో అధికంగా వస్తుంటాయని, ప్రజలను భాగస్వామ్యం చేస్తూ మన పరిసరాలను మనం శుభ్రంగా ఉంచుకుంటే సీజనల్ వ్యాధులను పూర్తి స్థాయిలో నియంత్రించగలమని అన్నారు. చికిత్స కంటే, నివారణ ఎంతో మేలని కలెక్టర్ అన్నారు. ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించక పోవడం వల్ల డయేరియా అధికంగా వస్తుందని, ఇది పిల్లలకు తొందరగా అటాక్ అవుతుందని అన్నారు. ప్రతి పి.హెచ్.సి., సబ్ సెంటర్ ల వద్ద అవసరానికి మించి 10 శాతం బఫర్ స్టాక్ తో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో పెట్టాలని అన్నారు. గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లు, ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి రోజూ ఉదయం ప్రేయర్ సమయంలో వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని, పేరెంట్ టీచర్స్ మీటింగ్ లో దీనిపై చర్చ పెట్టాలని అన్నారు. గత సంవత్సరం అధికంగా కేసులు నమోదైన ప్రాంతాలను హాట్ స్పాట్ లుగా ఎంపిక చేసి అక్కడ ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించాలని అన్నారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు పారిశుధ్య నిర్వహణ పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ సూచించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో పునరావాస కేంద్రాల వద్ద ఎటువంటి సీజనల్ వ్యాధుల వ్యాప్తి జరగకుండా స్పెషల్ శానిటేషన్ బృందాలను ఏర్పాటు చేయాలని అన్నారు. జిల్లాలో మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు స్టాక్ ఎప్పటికప్పుడు పరిశీలించాలని, తక్కువ ఉంటే వెంటనే దృష్టికి తీసుకొని రావాలని అన్నారు. డెంగ్యూ వైరస్ సాంపిల్స్ టెస్టింగ్ విస్తృతంగా చేయాలని అన్నారు. లక్షణాలు ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ఆసుపత్రులలో టెస్టింగ్ చేయాలని, ప్రతి ఏరియా ఆసుపత్రి, పి.హెచ్.సి వద్ద అవసరమైన కిట్లు అందుబాటులో పెట్టుకోవాలని అన్నారు. జిల్లాలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్ లో ప్రత్యేక పారిశుధ్య చర్యలను ప్రతి వారం వర్షా కాలం సీజన్ ముగిసే వరకు చేయాలని అన్నారు. ప్రతి శుక్రవారం ఇంటింటికి వెళ్లి నీటి నిల్వ ఉండకుండా చూసుకోవాలని, పారిశుధ్య జాగ్రత్తలు పాటించే విధంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. పాత కూలర్లు, కొబ్బరి బోండాలు, పగిలిన కుండలు, ఉపయోగం లో లేని పాత్రలు, టైర్ లలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని,

సీజనల్ వ్యాధులను గత ఏడాది నుంచి ఇప్పటికి ఎంత తగ్గించామనే అంశం పై మన పని తీరు ఆధారపడి ఉంటుందని అన్నారు. సమీక్ష లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ హాస్టల్స్, కేజీబీవీ ప్రభుత్వ పాఠశాలల్లో మూడు రోజుల పాటు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి వ్యక్తిగత పరిశుభ్రత పై అవగాహన కల్పించాలని అన్నారు.

7, 8 వ తరగతి పిల్లలతో సంక్షేమ హాస్టళ్లలో ఫుడ్ కమిటీలు ఏర్పాటు చేయాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, ప్రజలలో అవగాహన కల్పించాలని అన్నారు. ఈ సమావేశంలో డిఆర్వో ఏ. పద్మశ్రీ, డిఆర్డీవో సన్యాసయ్య, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ కళావతి బాయి, సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

# పదవ తరగతి అర్హతతోనే డ్రోన్ శిక్షణ

**ఖమ్మం ప్రతినిధి, జూన్ 23 (భద్రాద్రి న్యూస్):-**

ప్రస్తుత సమాజంలో డ్రోన్ శిక్షణకు ఉన్న డిమాండ్ ను దృష్టిలో పెట్టుకుని స్థానిక మహిళల కోరిక మేరకు పదవ తరగతి అర్హతతోనే డ్రోన్ శిక్షణ ను మహిళా ప్రాంగణంలో ఇస్తున్నామని జిల్లా మహిళా ప్రాంగణాధికారిణి వేల్పుల విజేత ఒక ప్రకటనలో తెలియ చేసినారు. రాబోయే పంట కాలాన్ని దృష్టిలో పెట్టుకొని పొలంలో విత్తనాలు వేయుటకు, పురుగుమందులు పిచికారి చేయుటకు నేటి ఆధునిక సమాజంలో డ్రోన్ పరికరాలను విరివిగా, వినూత్నంగా ఉపయోగిస్తున్న సంగతి మనందరికీ విధితమే . కావున పదో తరగతి చదువుకున్న మహిళలు ఇట్టి డ్రోన్ శిక్షణకు ను ఉపయోగించుకొని రాబోయే కాలంలో వ్యవసాయ, ఉద్యానవన తదితర శాఖలలో ఉద్యోగ అవకాశాలు పొందేందుకు అవకాశాలు విరివిగా ఉన్నాయని వాటిని వినియోగించుకోవాలని తెలియజేశారు. గ్రామీణ / పట్టణ ప్రాంత డ్వాక్రా గ్రూపులలో ఉన్న మహిళలు ఇట్టి శిక్షణను తీసుకుంటే వారికి, శిక్షణ ను అందించి డ్రోన్ పరికరాన్ని కూడా సబ్సిడీలో అందిస్తామని తెలియజేశారు. కావున ఆసక్తి ఉన్న పదవ తరగతి పూర్తి చేసిన మహిళలందరూ స్థానిక మహిళా ప్రాంగణం టేకులపల్లి నందు ఈనెల 24 నుండి 28 వరకు తమ దరఖాస్తులు అందించాలని తెలియజేసినారు. ఏమైనా సందేహాలు ఉంటే 7660022512 నెంబర్ లో సంప్రదించాలని కోరినారు.




# పెన్షనర్ వ్యతిరేక చట్టాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలి

**ఖమ్మం ప్రతినిధి, జూన్ 23 (భద్రాద్రి న్యూస్ ):-**





పెన్షనర్ల కు నష్టం కలిగించే ఇటీవల కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ లో ఆమోదించిన చట్టాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలి అని డిమాండ్ చేస్తూ ఆల్ ఇండియా స్టేట్ పెన్షనర్స్ ఫెడరేషన్ దేశ వ్యాప్త ఆందోళన కార్యక్రమంలో భాగంగా ఈ సోమవారం హనుమకొండ లో వున్న వరంగల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రధానమంత్రి కి విజ్ఞాపన పత్రం పంపాలని కోరుతూ జిల్లా కలెక్టర్ కలెక్టర్ సత్య శారద మేడం కి అందించడం జరిగింది.

ఎస్ జి పి ఏ టి వరంగల్ జిల్లా శాఖ ప్రతినిధి బృందం జిల్లా కలెక్టర్ వరంగల్ గారికి అల్ ఇండియా స్టేట్ పెన్షనర్స్ ఫెడరేషన్ ప్రాతినిధ్య లేఖ 604 మంది పెన్షనర్ల సంతకాలతో మరియు మార్కెట్ కమిటీ పెన్షనర్స్ అసోసియేషన్ 150 మంది పెన్షనర్ల సంతకాలతో తేది 23-6-2025 నాడు ఉదయం 11 గం లకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా అధ్యక్ష ,కార్యదర్శులు కె సుధీర్ బాబు,యన్ సదానందం,గౌరవ అధ్యక్షులు తుమ్మ వీరయ్య, స్పెషల్ టీచర్స్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి పి పెద్దయ్య,మార్కెట్ కమిటీ పెన్షనర్స్ అసోసియేషన్ నాగపురి సారయ్య, ఎస్ జి పి ఏ టి రాష్ట్ర ఉపాధ్యక్షులు వెలిశోజు రామ మనోహర్,రాష్ట్ర అసోసియేటెడ్ అధ్యక్షులు జి వీరా స్వామి ,రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి రాజయ్య ,గునిగంటి సాంబయ్య,వి బాబు రావు ,కృష్ణ కుమార్,రాధాక్రిష్ణ రావు, గునిగంటి రమేష్ ,బండి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రంలో అక్షరాభ్యాసం, సీమంతం కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ కన్నం వైష్ణవి

**ఖమ్మం ప్రతినిధి, జూన్ 23( భద్రాద్రి న్యూస్):**





ఖమ్మం46 డివిజన్ పరిధిలోని సారధి నగర్ లో అంగన్ వాడి కేంద్రంలో ఈరోజు అక్షరాభ్యాసం సీమంతం కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కార్పొరేటర్ కన్నం వైష్ణవి ప్రసన్నకృష్ణ పాల్గొని మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమం అభివృద్ధి ధ్యేయంగా ప్రజా పాలన కొనసాగిస్తుందని సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగా అంగన్వాడి కేంద్రాల ద్వారా మహిళలకు చిన్నారులకు పోషణ సామాగ్రి అందించబడతాయని, ప్రతిరోజు కార్యకలాపాలు నిర్వహిస్తూ చిన్నారులను ఉత్సాహపరుస్తూ వారికి జీవనశైలికి సంబంధించి అనేక విషయాలు తెలపడం జరుగుతుందని వారు తెలిపారు. కావున ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గర్భిణీ స్త్రీలకు శ్రీమంతం కార్యక్రమం నిర్వహించి తదనంతరం చిన్నారులకు అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరావు సహకారంతో డివిజన్లో అంగన్వాడి కేంద్రాలకు శాశ్వతభవనం నిర్మించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక మహిళలు , అంగన్వాడీ టీచర్లు శ్రీలత, రేణుక, చిన్నారులు పాల్గొన్నారు.

# ఘనంగా త్రివేణి ఆవిర్భావ దినోత్సవం

**ఖమ్మం ప్రతినిధి, జూన్ 23 (భద్రాద్రి న్యూస్):-**



ఖమ్మం నగరంలోని త్రివేణి పాఠశాలలో త్రివేణి విద్యాసంస్థల ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరిగింది. తెలంగాణ ప్రాంతంలో కొత్తగూడెం పట్టణంలో విద్య సేవ చేయాలనే సంకల్పంతో పురుడు పోసుకున్నది త్రివేణి విద్యాసంస్థ. 32 ఏళ్ల విద్యా ప్రస్థానంలో ఎన్నో విజయాలు త్రివేణి సొంతం. బోధనాభ్యాసన కార్యక్రమం లో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో ప్రముఖమైంది అయితే అందుకు అనుభవం కలిగిన ఉపాధ్యాయుల అవసరం ఎంతో ఉంది. సరిగ్గా ఇది గుర్తించిన త్రివేణి యాజమాన్యం అపార అనుభవం కలిగిన ఉపాధ్యాయుల చేత శాస్త్రీయమైన విద్యా విధానాలతో పాఠ్యాంశాల బోధన వలన ఉమ్మడి ఖమ్మం జిల్లాలో త్రివేణి పాఠశాల తన యొక్క ప్రత్యేకతను నిలుపుకొని అగ్రస్థానంలో నిలిచింది అని పాఠశాల డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి తమ సందేశంలో తెలియచేసారు. డిజిటల్ క్లాస్ రూమ్స్, యాక్టివిటీ బేస్డ్ ఎడ్యుకేషన్, ఐఐటి ఫౌండేషన్, ఐఐటి ఇంపాక్ట్, ఇగ్నైట్ ఎడ్యుకేషన్ సిస్టం, మొదలైన కార్యక్రమాలతో విద్యారంగంలో ఎప్పటికప్పుడు నూతనంగా వస్తున్న విధానాలను అందిపుచ్చుకుంటూ విద్యార్థులకు ఉత్తమ శిక్షణను అందిస్తున్నది త్రివేణి పాఠశాల. అత్యుత్తమ సౌకర్యాలతో సైన్స్ ల్యాబ్, అపారమైన పుస్తక సంపదతో గ్రంథాలయం త్రివేణి పాఠశాల ప్రత్యేకత అని అన్నారు. పాఠశాల ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్ గారు మాట్లాడుతూ గణితం సులభంగా నేర్చుకోవడం కోసం అబాకస్, ముందు జరిగిన తరగతులకు సంబంధించిన అంశాలను వెంటనే రివిజన్ చేసుకోవడం కోసం స్టడీ అవర్ ప్రోగ్రాం, వీటితో పాటుగా వేకప్ కాల్స్, గేమ్స్ అండ్ డ్రాయింగ్ కల్చరల్ ఆక్టివిటీస్, ఇంట్రా అండ్ ఇంటర్ హౌస్ కాంపిటీషన్స్ నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీసే ప్రయత్నం నిరంతరం త్రివేణిలో జరుగుతూనే ఉంటుంది. అంతేకాక విద్యార్థుల రక్షణ ప్రధాన అంశంగా వారిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం కోసం త్రివేణి అన్ని క్యాంపస్లు కూడా క్లోజ్డ్ సర్క్యూట్ కెమెరాలతో పర్యవేక్షించడం జరుగుతుంది. ప్రాథమిక దశ నుంచి విద్యార్థులకు ఆచరణాత్మక పద్ధతిలో బోధించడం కోసం ఫీల్డ్ ట్రిప్స్ తరచుగా నిర్వహించడం త్రివేణి ప్రత్యేకత అని తెలియచేసారు. ఇన్ని ప్రత్యేకతలు ఉన్నా త్రివేణి విద్యాసంస్థలు 1994వ సంవత్సరం జూన్




23వ తేదీన నూట ముప్పై ఐదు మంది విద్యార్థులతో ఆరుగురు ఉపాధ్యాయిని ఉపాధ్యాయులతో ప్రారంభమై నేడు దాదాపు 13 వేలకు పైగా విద్యార్థులు 1000 మందికి పైగా బోధన బోధ నేతర సిబ్బంది 15 బ్రాంచ్ లు 24 క్యాంపస్లతో ఐదు జిల్లాల్లో త్రివేణి విద్యాసంస్థలు విద్యారంగంలో చేస్తున్న కృషి ఫలితంగా రాష్ట్రస్థాయిలోనూ జాతీయస్థాయిలోనూ అత్యుత్తమ ఫలితాలను త్రివేణి విద్యార్థులు సొంతం చేసుకుంటున్నారని తెలిపారు. ఈ సంవత్సరం పదో తరగతి మార్కుల విధానంలోనూ అత్యధిక మార్కులను సాధించి రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించింది త్రివేణి. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే ప్రతిభా అవార్డులు కూడా అనేకం త్రివేణి విద్యార్థులకు లభించాయి .ప్రతి సంవత్సరం ఐఐటి జేఈఈ పరీక్షలలో జాతీయస్థాయిలో అత్యుత్తమమైన ప్రతిభ కనబరుస్తూ పదిలోపు ర్యాంకులను సొంతం చేసుకుంటున్నారు త్రివేణి విద్యార్థులు. దేశవ్యాప్తంగా ఉన్న అనేక ట్రిబుల్ ఐటీలు ఐఐటీలు ఎన్ఐటీలు మొదలైన ప్రతిష్టాత్మక విద్యాసంస్థలలో త్రివేణి విద్యార్థులు తమ ప్రతిభ ఆధారంగా చేరి చదువుకుంటున్నారు. త్రివేణి పాఠశాలలో చదువుకొని అమెరికా లాంటి దేశాలలో స్థిరపడిన త్రివేణి పూర్వ విద్యార్థులు అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఇలాంటి ప్రత్యేకతలు ఉన్న త్రివేణి పాఠశాల 1993వ సంవత్సరంలో అత్యుత్తమ విద్యని గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కూడా అందించాలని సంకల్పంతో చిన్ననాటి చదువు ముందు కాలానికి వెలుగు అనే లక్ష్యంతో గొల్లపూడి జగదీష్ కోటేశ్వరరావు యార్లగడ్డ వెంకటేశ్వరరావు డాక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి లు డైరెక్టర్లుగా కలిసి కృష్ణవేణి జూనియర్ కళాశాలను

స్థాపించి జూనియర్ కళాశాల కంటే పాఠశాల రంగంలో విద్యార్థులకు ఎక్కువగా అండగా నిలువవచ్చు అనే సంకల్పంతో త్రివేణి పాఠశాలను నెలకొల్పడం జరిగింది. అట్టి ఈ త్రివేణి విద్యాసంస్థలు ఈరోజు దినదిన ప్రవర్తమానమై అత్యుత్తమ ఫలితాలతో రాష్ట్రస్థాయిలో ప్రఖ్యాతిగాంచిన విద్యా సంస్థగా వెలుగొందుతున్నది. గ్రామీణ స్థాయిలోనూ వజ్రాలాంటి విద్యార్థులను సమాజానికి అందించిన త్రివేణి పాఠశాల దినదిన ప్రవర్తమానమై భవిష్యత్తు తరాలకు ఆధారమై అత్యుత్తమ ఫలితాలతో అత్యున్నత శిఖరాన్ని అధిరోహించాలని కోరుకుందాం అని పాఠశాల సిఆర్ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ అన్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు మిఠాయిలు పంచడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపల్ స్వప్న ,ముస్తఫా , పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు బోధ నేతర సిబ్బంది పాల్గొన్నారు.

# మాదక ద్రవ్యం వ్యతిరేక దినోత్సవం రిజోనెన్స్ సందర్భంగా విద్యార్థులకు అవగాహన

**ఖమ్మం ప్రతినిధి ,జూన్ 23( భద్రాద్రి న్యూస్):-**





అంతర్జాతీయ మాదక ద్రవ్యం,అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో రిజోనెన్స్ కాలేజ్ విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ శ్రీనివాసులు మాట్లాడుతూ ..మాదకద్రవ్యాల వాడకంతో మనిషి జీవన విధానంపై తీవ్ర దుష్ప్రభావం చూపుతుందని ట్రాఫిక్ ఏసీపీ అన్నారు. కాలేజ్ లో మాదకద్రవ్యాల వాడకంతో కలిగే నష్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మాదకద్రవ్యాల వాడకంతో నాడీ వ్యవస్థ దెబ్బతింటుందని అన్నారు. చెడు అలవాట్లకు బానిసై అసాంఘిక కార్యక్రమాలకు అలవాటుపడుతారని అన్నారు. ఎవరైనా మత్తుపదార్థాలు విక్రయిస్తున్నట్లు తెలిస్తే వెంటనే పోలీస్టేషన్లో సమాచారం అందించాలన్నారు. మాదకద్రవ్య రహిత సమాజాన్ని నిర్మించే లక్ష్యంలో విద్యార్థులు భాగస్వామ్యం కావాలని అన్నారు. ముఖ్యంగా తల్లిదండ్రులు నమ్మకంతో ఇచ్చిన స్వేచ్ఛను విద్యార్థులు దుర్వినియోగం చేసుకోకుండా ఉజ్వల భవిష్యత్తుకు పునాది వేయాలని అన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సిఐ సత్యనారాయణ, ఆర్ ఐ సాంబశివరావు, ఎస్సై రవి,సాగర్ పాల్గొన్నారు.

# ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య మహాసభ నూతన పాలకవర్గాన్ని ఘన సన్మానం

**ఖమ్మం ప్రతినిధి ,జూన్ 23 (భద్రాద్రి న్యూస్):-**



ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య మహాసభ నూతన పాలకవర్గాన్ని ఖమ్మం నగర ఆర్యవైశ్య సంఘం మహాసభ తరఫున అధ్యక్షులు గుమ్మడవెల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జిల్లా ఆర్యవైశ్య మహాసభ ప్రమాణ స్వీకారం చేసిన జిల్లా అధ్యక్షులు పసుమర్తి చంద్రరావు , ప్రధాన కార్యదర్శి గోళ్ళ రాధాకృష్ణమూర్తి మరియు వనమా కిరణ్ కుమార్ , ఆర్గనైజింగ్ సెక్రటరీ పాల్వాయి వెంకటేశ్వరరావు , ఉపాధ్యక్షులు నూకల శ్రీనివాస్ , వీరవిల్లి రాజేష్ , సమన్వయకర్త చారుగొండ లక్ష్మీ నరసింహారావు , సంయుక్త కార్యదర్శి పాల్వాయి సీతయ్య , మహిళా విభాగం అధ్యక్షురాలు దోసపాటి సంధ్యారాణి , అధికార ప్రతినిధి చలవాది నగేష్ , లీగల్ సెల్ కమిటీ చైర్మన్ కొత్త వెంకటేశ్వరరావు , అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జ్ కల్వకుంట్ల గోపాలరావు , హెల్త్ వెల్ఫేర్ కమిటీ అధ్యక్షులు పసుమర్తి లక్ష్మణరావు , చిరు వ్యాపార సంఘ అధ్యక్షులు మిట్టపల్లి రవికుమార్ , మీడియా విభాగం చైర్మన్ కొత్తూరు రమేష్ , వాసవి సేవాదళ్ విభాగం చైర్మన్ పబ్బతి ప్రదీప్ కుమార్ , dr. డి పి సి రావు , లను ఘనంగా సన్మానించడం జరిగినది . ఈ కార్యక్రమం కు నగర అధ్యక్షులు గుమ్మడవెల్లి శ్రీనివాస్ , ప్రధాన కార్యదర్శి రాయపూడి రవికుమార్ , కోశాధికారి రాయపూడి జయరాం , ఊటూరి లక్ష్మీనరసింహారావు , గుంటుపల్లి దివాకర్ గుప్తా , బూర్లే పుల్లారావు , గౌరవ సలహాదారులు చిన్ని కృష్ణారావు , వెన్నెమురి వెంకట సుబ్బారావు , కందిబండ వేణుగోపాల్ , కురివెళ్ల గోపాలకృష్ణమూర్తి , వేంశెట్టి మోహన్ రావు , బూర్ల లక్ష్మీనారాయణ , వల్లాల యుగంధర్ తదితరులు పాల్గొన్నారు .

Printed ,Published and Owned by CHENGAPONGU SAIDULU,and printed at KAKATI BABU PRINTERS H No.4-10. Telagarama varam ,Laximidevipally , Kothagudem -507101, Dist .Bhadradri kothagudem, Telangana. And Published At H No. DA-416 ,Babu camp ,chunchupalli (M) , Kothagudem -507101 ,Dist Bhadradri kothagudem, Telangana.Editor: CHENGAPONGU SAIDULU. RNI TELTEL 2023/90682 Call No.6302329046